# లెమ్ము, తేజరిల్లుము

**యెషయా 60:1-3; లూకా. 10:17-20; కొలస్స. 2:1-5.**

దేవుడు తన ప్రజలను అన్య జనాంగములమధ్యకు తీసికొని వెళ్లి అక్కడ మహిమ పొందిన సంగతి బైబిలంతటిలో కనబడుచున్నది. దావీదు ఇది వరకు ఇశ్రాయేలీయుల మధ్యనే తిరుగుచు సౌలు ఇంకను తరుముచున్నందున ఇశ్రాయేలీయుల దేశమునుండి పారిపోయినాడు. ఈవేళ శత్రువులైన ఫిలిష్తీయుల దేశమునకు పారిపోయినాడు. ఎక్కడకు పోయినా ఆయనను దేవుడు కాపాడినాడు. ఆయన తన ఏర్పాటులో ఉన్నవారిని, వారు ఎక్కడ ఉన్ననూ కాపాడును. వారిని తన మహిమ కొరకే కాపాడును ఆ పిదప వారికి అత్యధిక ఆశీర్వాదములను అనుగ్రహించి వెలిగించును. ఆలాగున అన్యజనులలో దేవుడు వెలిగించిన, పాతనిబంధన సంఘ పితరుల జీవితములను నేడు ధ్యానించెదము.

**1. అబ్రాహాము:-** అబ్రాహాము విశ్వాసమును విడిచిపెట్టి అన్యరాజున్న దేశమునకు వెళ్లినాడు. ఆది. 20:7 ఇందులో అబ్రాహాము హెబ్రోనునుండి బైలుదేరి అబీమెలెకు ఉన్న దేశములోనికి రాగా, శారా నిమిత్తము ఆ రాజుగారి ఇంటిలో అందరికి జబ్బు చేసినది. అప్పుడు దేవుడు ఆ రాజుకు కలలో కనబడి, అబ్రాహామును పిలిపించు అతడు ప్రార్థనచేసిన నీ ప్రజలు బాగవుదురని' చెప్పెను. గనుక దేవుడు అక్కడ తన ప్రభావమును చూపించెను. ఒక గదిలోని దీపమును మరియొక గదిలో పెట్టినను వెలుగును. అబ్రాహామును గెరారు దేశములో పెట్టినను అక్కడకూడా వెలిగెను. దేవుని ప్రజలు వారు ఎక్కడ ఉంటే అక్కడ వెలగవలెను. ఒకానొకప్పుడు దేవుడు తన ప్రజలను తన ప్రజలమధ్యనుంచక అన్యుల మధ్య ఎందుకు ఉంచును? జవాబు- 1. తన ప్రజలు అన్యులమధ్య వెలగవలెను. దైవజనుల పని

వెలుగుట. 2. దేవుడు తానే స్వయముగా బైలుపడుటకు (ఇది దేవుని పని). 3. అన్యులు ఇది తెలిసికొని సహాయము కొరకు దేవునియొద్దకు రావలెను (అన్యులపని). సిద్ధాంతము:- దేవుని బిడ్డలు ఎక్కడబడితే అక్కడే వెలగవలెను.

అన్యులు దేవునిని తెలిసికొనుటకును, అబ్రాహామునకు పని కల్పించుటకును దేవుడతనిని ఇతర దేశమునకు పంపెను. పురుగు దీపము ఆర్పివేయుటకు రాగా దీపము దానిని కాల్చివేసినట్లు దైవ ప్రజలు తమ్మును చంపవచ్చిన శోధనలు, కష్టములు మొదలగు వాటిని తమ వెలుగుద్వారా ఆర్పివేయవలెను. దేవుడు తన ఉద్దేశమును నెరవేర్చుకొన్న తరువాత అబ్రాహామును పాలస్తీనా తీసికొని వెళ్లెను. సంఘములోనికి వచ్చేటప్పుడే ప్రభువు మనకు వెలిగే వరము ఇచ్చివేసినాడు. కొంతమంది 'నేను లోకమునకు ఎందుకు వచ్చినానో' అని అనుకొందురు. పై మూడు పనులు జరుగుటకు మనము ఈ లోకమునకు వచ్చినామని గ్రహించవలెను.

**2. ఇస్సాకు చరిత్ర:-** ఆది. 26వ అధ్యాయము. కరువు కాలములో అన్యుల దేశమునకు వెళ్లెను. 28వచనము. దేవుడు ఇస్సాకునకు తోడైయున్నాడని అన్యులు తెలిసికొన్నారు. **వెలుగుట, బైలుపడుట, తెలిసికొనుట,** ఇస్సాకుయొక్క అభివృద్ధి దీపమువలన అన్యులు దేవునిని తెలిసికొనిరి. అబ్రాహాము కాలములో దేవుని స్వప్న ప్రత్యక్షతనుబట్టి అన్యులు దేవుని తెలిసికొనిరి. మనము ప్రతి దినము అభివృద్ధిలో ఉండవలెను. **విశ్వాసులు స్వజనుల మధ్యను, పరజనుల మధ్యను వెలగవలెను. సౌఖ్యకాలములలోను, కష్టకాలములలోను వెలగవలెను.** నేను వెలుగుచున్నానా? నాద్వారా దేవుడు బైలుపడుచున్నాడా? అని ప్రశ్నించుకొనవలెను.

**3. యోసేపు:-** అన్నలు పడవేసిన గుంటనుండి పోతీఫరు ఇంటివరకు, అక్కడనుండి చెర వరకు, అక్కడనుండి

సింహాసనము వరకు, తాను ఉన్న అన్నీ స్థలములలో వెలిగినాడు. ఐగుప్తీయులు శత్రువులపైనను, వారి మధ్యను, ఒక స్త్రీ శత్రువైనను, ఎక్కడబడితే అక్కడే వెలిగినాడు. యోసేపు అనగా అభివృద్ధి అని అర్ధము. మనమందరమును యోసేపులమై యుండగలము. యోసేపు అన్నదమ్ములతో "మీరు నన్ను ఇక్కడకు పంపలేదు, దేవుడు పంపినాడు" అనెను. యాకోబు సంతతి యోసేపు దగ్గరకి వచ్చిన తరువాత, యోసేపు ఆయా కష్టములలో పడినప్పుడు దేవుడెందుకు ఊరుకున్నాడో తెలిసినది. యోసేపుయొక్క అభివృద్ధి కొరకును, తన బిడ్డల (దేవుని బిడ్డల) అభివృద్ధి కొరకును ఊరుకొనెను. హెబ్రోనునుండి యోసేపు ఊరి బైటకు అనగా దోతానుకు వచ్చినప్పుడే అతనికి చాలా కష్టమైనది. అయినను దేవుడు ఊరుకున్నాడు. ఈ బోధ మన కొరకే అయి ఉన్నదని గ్రహించి, మన కష్టములలో ఊరుకొనవలెను. అన్నలు కలుగజేసిన కష్టములు, అతనికి తెలియును. అయినను దేవుడు చేసినాడని చెప్పెను. ఈ మూడు కథలలో మూడు వెలిగింపులున్నవి.

**4. మోషే:-** ఆదికాండము విడిచి, మోషే వద్దకు వెళ్లుదము. తన ప్రజల విజ్ఞాపన దేవుడు ఆలకించి మోషేను పంపగా, 10 అద్భుతముల మూలమున ఐగుప్తీయులు దేవునిని తెలిసికొనిరి. తమకు విడుదల కలుగబోవుచున్నదని ఇశ్రాయేలీయులు గ్రహించిరి. పస్కాను ఆచరించిరి. ఐగుప్తీయుల నగలను తీసికొని వెళ్లిరి. ఇన్ని కష్టములలో దేవుడెందుకు ఊరుకున్నాడు? జవాబు: లోక జనులందరు ఆయనను గురించి తెలిసికొని భూలోకమంతా తన మహిమను తెలిసికొనేటందుకు ఊరుకొనెను. 1) దేవునికి మహిమ రావలెను. ఐగుప్తీయులు హెబ్రీయుల దేవుడు ఎఱ్ఱ సముద్రమును పాయలు చేసిన దేవుడే గొప్పవాడనిరి. 2) దేవుని ప్రజలు దేవుని ప్రజలైయుండవలెను. ఐగుప్తీయులు ఇశ్రాయేలీయుల యెడల అభిమానులై ఉన్నారు

గనుక నగలు ఇచ్చినారు. దేవుడు తనప్రభావమును చూపుకొనెను. నా చేయిచాపి ఐగుప్తీయులలో నుండి మిమ్మును విడిపిస్తానని మోషేతో చెప్పి, తన చేతిని చూపకుండా, ఐగుప్తీయుల చేతులు ఇశ్రాయేలీయులకు సహాయము చేయుటకు చాపుట అను క్రియద్వారా నెరవేర్చుకొనెను.

**5. ముగ్గురు యవౌవనస్థులు:-** ఇశ్రాయేలీయులు బబులోనుకు వెళ్లిరి. అగ్నిగుండములో ముగ్గురు పడవేయబడిరి. ఎందుకు? దేవుని ప్రజలనుబట్టి నెబుకద్నెజరు గొప్ప పాఠము నేర్చుకొనుటకు. దాని. 3:26. 'మహోన్నతుడైన దేవుని సేవకులారా! ఈ విధముగా రక్షించుటకు మరీ ఏ దేవుడు లేడనెను'. దేశరాజులకు గొప్ప పాఠము తన బిడ్డలద్వారా నేర్పెను. అగ్నిలోని బిడ్డలు వెలుగై యున్నారు. ఈ ఐదు కథలలో పై మూడు అంశములు జ్ఞప్తికి వచ్చుచున్నవి. దేవుడు సర్వవ్యాప్తి అయి ఉన్నందున తన భక్తులకు హానిరాదు. తనకు మహిమ రావలెను. తన బిడ్డలకు ఒక మేలు రావలెను. శ్రమపెట్టిన వారికి పాఠము నేర్పవలెను. ఈ మూడింటినిబట్టి విశ్వాసులు శోధనలోనికి వెళ్లుదురు. మనకు ఎన్ని కష్టములు వచ్చినను ధైర్యముగా ఉండి, పౌలుచెప్పిన రీతిగా "నేను శ్రమలయందు సంతోషించుచున్నాను" అనవలెను. ప్రభువు- 'నా నామము నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి, మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి, ఆనందించుడి' అని చెప్పినారుగదా! మత్తయి. 5:1-12; అపో. 9:15. యెహోవా దేవుడు ఇశ్రాయేలీయులను శ్రమలోనికి నడిపినారు, ఎందుకనగా వారిని విడిపించి వారి స్తుతులు అందుకొనుటకే. ఈ 5 చరిత్రలు, 3 అంశములు తలంచుకొని మనము దేవునిని స్తుతించుచూ అభివృద్ధి పొందవలెను. దేవుడు ఈ కొద్దిమాటలు దీవించునుగాక! ఆమేన్.

# శోధన, సాధన, బోధన

**కీర్తన. 92:1-5; లూకా. 9:7-9; ఫిలిప్పీ. 2:14-15.**

ప్రసంగ పాఠము:- 1సమూ. 21:10-15, దా.కీర్తనలు.34.

శ్రమకాల విశ్వాసులారా! మనము శ్రమ కాలములో ఉన్నాము. లోక, దేశ, సంఘకాలములు చూడగా శ్రమకాలములోనే ఉన్నాము. ప్రభువు ఈ కాలములో వచ్చునని చెప్పెను. శ్రమకాలము వచ్చును, పోవును. ఆది సంఘకాలములో మధ్య యుగకాలములో శ్రమలు వచ్చినవి, పోయినవి. మన కాలములో శ్రమలు వచ్చును, పోవును.

ఈవేళ పాఠములో దావీదు శ్రమకాలములో ఉన్నాడు. దావీదుకు దేవుడు తోడైయున్నాడని తెలుసుకొనవలసినది. పోయినవారము పాఠములో ఒక ఒక చోటినుండి మరియొక చోటకు పారిపోయిన దావీదు ఈవేళ కత్తి తీసికొని పారిపోయెను. దావీదు మనస్సులో భయము, భీతియు ఉన్నది. సౌలు తన సైన్యము వచ్చుచున్నారు గనుక సౌలు అసూయ, సౌలు సైన్యమును పంపుట ఇవి దావీదు భయమునకు కారణములు. అయితే, భయపడుటకు కారణములున్నప్పుడు భయపడవచ్చునా? కీర్తన. 34:1 దేవదూతల కావలి ఉండునని ఉన్నది. భయము ఎందుకనగా 1.అనుమానమునుబట్టి 2. నిజమైన కారణమునుబట్టి భయము. దేవుని వాక్యములో ఈ రెంటిని బట్టి భయము ఉండకూడదు అని ఉన్నది. అయినను విశ్వాసులందరకు ఈ రెండు భయములున్నవి. దావీదు శ్రమ కాలములో, భయపడే కాలములో ఉన్నాడు. గనుక పారిపోవు

చున్నాడు. దావీదు పారిపోయే స్థలములు కీడు ఉన్న రెండు స్థలములు. సౌలు ఉన్న రాజ్యములో ఉంటే దావీదుకు హాని. యాజకునివద్ద రొట్టెలడిగి ఊరుకూడ సౌలు రాజు చేతిలో ఉన్న పట్టణమే గనుక ఇదీ హానియే. సౌలు రాజు సరిహద్దులు దాటి శత్రువుల రాజ్యములో గాతు పట్టణమునకు పోవలెను. ఈ రెండు హానికరములైన స్థలములలోబడి పోవలెను. గాతు పట్టణమునకు వెళ్లెను. హానికరమైన స్థలమునకు వెళ్లెను. తక్కువ హానికరమైన స్థలముదాటి, హానికరముమైన స్థలమునకు వెళ్లుచున్నాడని తలంచిన చరిత్రకారులు దావీదు పని తెలివి తక్కువ పని అని వ్రాసిరి ఇట్లు దావీదు వెళ్లుటకు కారణము భయమే.

ఈ విధమైన పరిస్థితిని దేవుడు కల్పించుటకు కారణమేమనగా, దావీదు 1. మంచిలోనికి వచ్చుటకు, కీడు విడుచుటకు 2. మంచివాడైనను, క్రీస్తు సజ్జనత్వములోనికి వచ్చుటకు. శ్రమలు విశ్వాసులకు వచ్చును. ప్రభువు ప్రార్ధనలోని ఆరవ మనవి. 'మమ్ములను శోధనలోనికి నడిపించవద్దు అని ఇంగ్లీషులో ఉండగా, శోధనలోనికి తేకుము అని తెలుగులో ఉన్నది.

శోధన ఉన్నది. దేవుడు శోధనలోనికి నడిపింపకూడదు గాని విశ్వాసులను శోధన వద్దకు నడిపించును. దాని అర్ధము శోధన వద్దకు నడిపించును. మరిఒకటి శోధనలోనికి నడిపిస్తాడు. గనుక శోధనలోకి తేకుమని ప్రార్ధించుమనెను. శోధన ఎటువంటిదో తెలియవలెను. 1) శోధన కనబడకపోతే తెలియదు. 2) శోధన జయించే పద్ధతి రాదు. 3) జయించే పద్ధతి రాకపోతే క్రైస్తవ అనుభవము ఎట్లు వచ్చును. దేవుడు శోధన వద్దకు నడిపించును. ఎప్పుడనగా మనుష్యుడు దుర్మార్గత విడువక, దేవునిమాట విననప్పుడు దేవుడు శోధనలోకి నడిపించును.

సైతాను శోధించే పని ఇది భయంకరమైన పని. దేవుని చేతిలో పడుట భయంకరము. దేవుడు ఊరుకుంటాడు, ఊరుకుంటాడు తుదకు శోధనకు విడిచిపెట్టును. గొర్రె వెళ్లుచున్నది. అదలించినా మాట వినకపోయెను గనుక కాపరి విడిచెను. గొర్రె గుంటలో పడెను ఇదే దేవుడు శోధనలోనికి నడిపించుట అని అర్ధము.

దావీదును నడువనిచ్చెను. ఇది దేవుని ఉద్దేశముకాదు, దావీదు ఉద్దేశము. సౌలు పట్టణము నుండి శత్రువుల పట్టణమునకు వెళ్లుట; ఇట్లు నడువనిచ్చుట దేవునికి ఇష్టముకాదు. భయము విడిచిపెట్టి అడవిలోగాని, ఇంకా ఎక్కడికి వెళ్లినా దేవునికే ఇష్టము ఇది దేవుని మార్గము. అయితే దావీదు ఉద్దేశము మంచిదికాదు, దావీదు గాతుకు వెళ్లినాడు. గాతు గొల్యాతు పట్టణము. అక్కడ శత్రువులు చంపుదురుగాన వెళ్లకూడదు. సౌలు శత్రుత్వము నన్ను వెంటాడుచున్నది గాని గాతువారి శత్రుత్వము చల్లారినదని ఉద్దేశపడెను. దేవుడు సౌలు పట్టణము, గాతు పట్టణము వెళ్లనిచ్చెను. అయినను దావీదును దేవుడు చూస్తు, కాపాడి శోధనలోనికి వెళ్లనివ్వక కాపాడెను. ఆకీషురాజు దావీదు ఆ దేశపు రాజుకాడా! స్త్రీలు పాటలు పాడిన దావీదు ఇతనుకాడా? ఈ దావీదును బంగ్లాలోనికి రానిచ్చినారనగా దావీదునకు భయము కలిగినది. వెర్రివానివలె నటించెను. 1) భయము 2) తన ఇష్టము వచ్చినట్లు వెళ్ళుట 3) శత్రువుల యొద్దకు వెళ్లుట 4) వెఱ్ఱివానివలె నటించుట. **ఇవన్నీ బలహీన మానవుని మార్గములు.** కానీ దేవుని అడిగి వెళ్లవలసినది గానీ దేవునిని అడిగి వెళ్ళనందున గందరగోళములో పడెను (ఎందుకంటే దేవుడు కనబడి, నీవు భయపడనక్కరలేదు అని అనలేదు గనుక ఇంకా గందరగోళము). మనిషిని దేవుడు తన ఇష్టానుసారముగా

పోనిస్తాడు. ఎప్పుడో ఒకప్పుడు సహాయము చేస్తాడు. అప్పటివరకు దేవుడు ఊరుకుంటాడు. భయము పోయేవరకు ఊరుకుంటాడు.

గాతు పట్టణములో తాను పన్నిన మాయోపాయముల వల్ల, తప్పించుకున్నాడని కనబడుచున్నది గానీ దావీదు అభిషిక్తుడు గనుక దేవుడు కాపాడి తప్పించెను. అపాయము తప్పించుకొనుట దావీదు పని (అభిషిక్తుడు గనుక) దావీదు తప్పించుకొనవలెనని ప్రయత్నించిననూ, దేవుని సహాయము ఉండుట వలన శోధనలోనికి వెళ్లినను తప్పించుకొన్నాడు. **ఒకవేళ దావీదు తప్పించుకున్నను తప్పక దేవుని సహాయము తప్పించును.** దావీదు తప్పించుకొనుటకు ప్రయత్నించుట మంచిదేగాని దేవుని మార్గము విడిచెను. దా.కీర్తన. 34వ అధ్యా. దావీదులో దేవునియెడల భక్తి తాత్పర్యములున్నవి గాని బలహీనతనుబట్టి పారిపోయెను.

దావీదుచేతిలో గొల్యాతు కత్తి ఉన్నది. అది తీసికొని గాతువారు చంపవలసినది. గానీ దేవుడు కాపాడినాడు దేవుడు కాపాడినాడు గనుక కాపాడబడ్డాడు. కానీ తన కాపుదల వలనకాదు, వెఱ్ఱితనము వలె నటించుటవలనకాదు. రాజువద్దకు కత్తిచేత పట్టుకొని వెళ్లుట ఇది వెఱ్ఱితనము. దావీదును రాజు, ఈసికొని వెళ్లమనగా వెళ్ళిపోయెను. విశ్వాసులు దావీదువలె భయపడి పారిపోవుచున్నారు, దావీదువలె సొంత పద్ధతిని నడుచుచున్నారు. ***1) స్వంత భయము, 2) స్వంత మార్గము, 3) స్వంత పద్ధతి;*** ఇవి మంచివికావు. విశ్వాసులకు దేవుడు సహాయము చేసిన ఆ పద్ధతి మంచిది. గనుక దేవుడే వారిని తప్పించినాడని అనుకొందురు. దావీదు తప్పు పద్ధతి ప్రకారము నడిచినందున (వెర్రి వేషము) దేవుడు తప్పించలేదు గాని దేవుని

కృప, నడిపింపునుబట్టి తప్పించెను. శోధనలు వచ్చును గనుక తప్పు పద్ధతి ఉపయోగపరచవద్దు. దేవుడు నాకు సహాయము చేసినాడంటే నీ స్వంత పద్ధతినిబట్టికాదున; కృపనుబట్టి గనుక; ఏ కార్యమైనా, నీ పద్ధతి ప్రకారము ఊహించి జరుపుకొనుట మంచిదికాదు.

1. దేవుని చిత్తము, 2. దేవుని మార్గము, 3. దేవుని పద్ధతి ఇట్లు నడిపించును. దేవుడు తన చిత్త, మార్గ, పద్ధతి ప్రకారము నడిపించునని మనము అవి చదువుకొని నేర్చుకొనుటకు వ్రాయించెను. దావీదును తన స్వంత చిత్తము మార్గము పద్ధతి ప్రకారము నడువనిచ్చి కాపాడెను.

ప్రభువు 40 దినములు శోధింపబడినప్పుడు సాతాను ఒక వాక్యమెత్తెను. 'నీవు దుమికిన దూతలు నిన్ను ఎత్తిపట్టుకొందురు' అను వాక్యము ఎత్తుకొనెను దా.కీర్తన. 90:11-12. ఇక్కడ అర్ధము ఏమనగా 1. దావీదు స్వంత మార్గము 2. దేవుని ఏర్పాటు మార్గము. మనిషి తాను నడిచే మార్గము విడిచి, దేవుని మార్గము వెంబడించవలెను. దేవుడు వేసిన మార్గము మనుష్యుడు నడిచెను. మనుషుల స్వంత మార్గములలోకాక, దేవుని మార్గములలో నడిచిన అపాయములు వచ్చినప్పుడు దేవదూతలు నిన్ను ఎత్తి పట్టుకొందురు.

మత్త. 4వ అధ్యాయములో సైతాను ఈమాట ఎత్తినప్పుడు దేవుని మార్గము విడచిపెట్టుటకు చూపించెను. సగము విడచిపెట్టుటకు ప్రయత్నించెను. దేవుని మార్గములో మనిషి నడిచినప్పుడు దేవుడు తప్పించునని ఉన్నది. ఇది దాచి, అపవాది దుముకుము అన్నది. అది సైతాను మార్గము. ఇది

మనిషి మార్గముకూడాను. సైతాను మార్గమేనని అనుకొనే మనిషి మార్గము. దేవుని మార్గములో నడిచేవారిని పడినా దేవుడు పట్టుకొనును. కాలికి రాయి తగులకుండ ఎత్తి పట్టుకొనును. సైతాను మాయబోధ చేసెను. ప్రభువు దానిని గుర్తించెను. దేవుడు దావీదును కాపాడకూడదు. కారణము తన స్వంత మార్గము ఉపయోగించెను. అయినను కృపనుబట్టి కాపాడెను. ఆలాగుననే సువార్తికులు దేవుని చిత్త ప్రకారము ప్రార్థించి వెళ్లినపుడు, అపాయము వచ్చినా కాపాడును. వారి స్వంత మార్గము ప్రకారము నడచినా నడువనిచ్చును. అపుడు పడినా, ఊరుకొనును. అడ్డము పెట్టడు. ప్రార్థించినా తప్పించును. దేవుని మార్గమెక్కినాడు గనుక సౌలు గ్రామములో ఉండుట నష్టమా? గాతులో ఉండుట నష్టమా? గాతులోనే నష్టము. ఇది పులి నోట తప్పించుకొన్న మనిషి ఎలుగుబంటి నోటిలో పడినట్లున్నది. పులిని జడిపించినప్పుడు అది పారిపోవును గాని ఎలుగుబంటి తొలగదు. అయితే, దావీదును దేవుడే తప్పించెను. ఆయన కృపను బట్టి తప్పించెను. అయితే, స్వంత మార్గములో ఉన్న తప్పించడు.

మనము వెళ్లేటప్పుడు కాలి దారి ఉన్నది. ముందుకు వెళ్లగా మూడు దారులు ఉన్నవి. 1) ఊరు దారి 2) అడవిదారి 3) పొలముదారి. గనుక ఆగి ఎవరినైన అడుగవలెను. అట్లే మనము దేవుని అడిగి, దేవుని మార్గము ప్రకారము నడువవలెను. సౌలువద్దనే అపాయము గాతు పట్టణములో అపాయములేదు అని దావీదు తలంచెను. దావీదు పారిపోయి వచ్చినాడు గనుక సౌలును చంపినయెడల ఇశ్రాయేలు రాజ్యము తమకు వచ్చును అని ఆ కీషు సైన్యమనియుందురు. నీవు అప్పుడు శత్రుత్వమును బట్టి గొల్యాతును చంపినావు. నీవు ఇప్పుడు సౌలును, మాతో

కలిసి చంపినా మనకు స్నేహము ఉండునని అనియుందురు. ఉదా:- బంతి ఆడువారు బంతిని కొట్టుకుంటూ మరియొక స్థలమునకు వెళ్ళెను. వారితోకూడ అవతలి జట్టులోని బంతిని కొట్టువారుకూడ వెళ్లిరి, అట్లే దేవుడు దావీదును నడిపించెను. దావీదు వెళ్లుట నిజమే, ప్రభువు నడిపించుట నిజమే. దేవుడు తన శత్రువులయొద్దకు నడిపించినా ఇది మరీ గొప్పది. శత్రువుల వద్దకు రాకుండా కాపాడుటకంటె. దగ్గరకు రానిచ్చి తప్పించుట మరీ గొప్ప పని. దావీదును శత్రువులయొద్దకు వెళ్లనిచ్చి కాపాడెను. ఇదిగొప్ప పని.

మత్త. 4వ అధ్యాయములో ప్రభువు ఆత్మవలన, అపవాదిచేత శోధింపబడుటకు వెళ్లెను. ఇది దైవమార్గము. ఈ అధ్యాయములో మనిషి, విశ్వాసి ఎవరనగా, ప్రభువే. ప్రభువు శోధనవద్దకు వెళ్లెను. శోధింపబడగా ప్రభువు జయించెను. ఆలాగే ప్రభువు శోధనలయొద్దకు మనలను నడిపించి, తప్పించి జయమిచ్చును. మరికొన్నిసార్లు శోధనలోనికి పోనీయడు దావీదు గాతు వెళ్లుటవలన గాతువారికి రెండు సంగతులు జ్ఞాపకము తెచ్చెను. 1) గాతు వారి అపజయము (గొల్యాతును చంపినందున), 2) దావీదు జయము కనబడినది. నా అభిషిక్తునివల్ల మీరు అపజయము పొందినారు. నా అభిషిక్తుడే జయించెను. ఇట్లు అపవాదికి దేవుడు తెలియజేయును. 'ఇవన్ని ఇదివరకు జయించెను. ఇప్పుడు నీవద్దకే నడిపించుచున్నాను. అది నీకు జయముకాదు, నా బిడ్డలకే జయమని తెలియజేయుటకు దేవుడు శత్రువుల వద్దకు నడిపించును.

ప్రభువు ఈ కొద్ది మాటలు మీ మనస్సులలో ముద్రించి, మీకు సహాయము చేయునుగాక! ఆమేన్.

# ఆమేన్

"ఆమేన్"యై యున్న తండ్రీ! నీకు వందనములు. అనాదికాలమందు ఆలోచించినట్లు ఆదిని సృష్టిని కలుగజేసి పూర్తిచేసినావు. అప్పుడును ఆమేన్ అయి ఉన్నావు. ప్రార్థన పూర్తియైనప్పుడు ఆమేన్ అన్నట్లు ప్రార్థన నెరవేర్పు అయినప్పుడును ఆమేన్ అనవలెను. సృష్టిపూర్తి అయినందున ఆమేన్ అనవలెను. సువార్త ప్రకటనలో రక్షణ వాగ్ధానము పెట్టి ఇచ్చినావు, నెరవేర్చినావు గనుక ఆమేన్ అయినావు. సృష్టిని ఇచ్చి ఆమేన్ అయినావు రక్షణ వాగ్ధానము ఇచ్చి నెరవేర్చిన నీవు ఆమేన్ అయియున్నావు. లవొదికయ సంఘమునకు ఆమేన్ అయి ఉన్నావు. అంతకుముందే ఆమేన్ అయినావు. నీవు లేకుండ ఏమియు కలుగలేదు. యోహాను 1వ అధ్యా॥లో 'నీవు లేకుండ సృష్టి కలుగలేదు' అని ఉన్నది. నీవు ఆమేన్ అయి ఉన్నావు. నీవు లేకుండా ఏ సంగతి కలుగలేదు. నీవు తెలియపర్చకపోయిన ఏ సంగతి బయలుపడదు గనుక నీవు ఆమేన్ అయి ఉన్నావు. పాతనిబంధనలో ఆమేన్ అయి ఉన్నావు. సంఘ నావ కట్టకముందు చెక్క నావ కట్టి, రక్షితులను బైటికి తీసికొని వచ్చినావు. అక్కడ రక్షణ నెరవేరినది అది ఆమేన్. అక్కడనే అది నెరవేరినది. నీవు ఒక జనాంగమును ఏర్పాటు చేసికొని, నీవలన వాగ్ధానము నెరవేర్చుదునని చెప్పి, నీ వాగ్ధానము నెరవేర్చిన నీవు అప్పుడు ఆమేన్ అయియున్నావు. 4వేల సం॥ల క్రితము కనిపెట్టిన వారికి నీ నెరవేర్పు తెలియదు. వాగ్ధాన నెరవేర్పుగా ఒకరోజు తొట్టెలో పండుకొన్నావు. తొట్టిలో పండుకొన్నావు గనుక అక్కడ ఆమేన్. సిలువలో నీవు సమాప్తము అన్నావు. అంతయు సమాప్తము. రక్షణ కార్యము సంపూర్తియైనది. సృష్టి సమాప్తమైనది, అన్నట్లు అక్కడ నీవు సమాప్తి చేసినావు. అది ఒక ఆమేన్ అయి

ఉన్నది. నా రాజ్యము వచ్చువరకు మీలో కొందరు చావరన్నావు. ఆలాగే ఆత్మ కుమ్మరింపు అయినది. సంఘము స్థాపించినావు. నిన్నుబట్టి సంఘస్థాపన కుమ్మరింపు జరిగినది గాన నీవు ఆమేన్ అయినావు. 20వందల కాలములో ఎన్నో ప్రార్ధనలు చేయగా వారు భూలోకములో "ఆమేన్" అన్నారు. నిజమేగాని నీవు పరలోకములో ఆమేన్ అనకపోతే ఇక్కడ భక్తులన్న ఆమేన్ వల్ల ప్రయోజనములేదు. ప్రయోజనముకరమైన ప్రార్ధనలు అన్నియూ, 'ఆమేన్' అని నెరవేర్చిన నీకు వందనములు.

ఆదినుండి సంఘకాలము మొదలుకొని, లవొదికయ కాలము వరకు భక్తుల ప్రార్ధనలు నెరవేర్చుచున్నావు. అన్నిటికి నెరవేర్పు అయియున్నా 'ఆమేన్'. అయియున్న నీ ద్వారానే వేడుకొనుచున్నాము. ఇక్కడ నేర్చుకొనే పాఠములకు ఆమేన్ అనుకొనకపోతే లాభములేదు. నీవు ఇక్కడ నిలువబడి మా ప్రార్ధనలన్ని ఆమేన్‌గా మార్చుచున్నావు వందనములు. రాకడ కాలములో మేఘముమీదకు వెళ్ళగలిగితే అక్కడకు వెళ్ళి మా ప్రార్ధనలన్నిటికి ఆమేన్ అందుము. అందరికి రేప్చర్ సిద్ధపర్చబడియున్నది గాని ఎవరు సిద్ధపడగలరో వారిని సిద్ధపర్చుము. రేప్చరుకు వెళ్ళలేని వారిని మరణముద్వారా సిద్ధపర్చుము. నీ కృప రెండు గుంపులకు అనుగ్రహించుము. ఇక్కడ ఉన్నవారిలో సజీవుల గుంపు ఎవరో, మరణముద్వారా సిద్ధపడు మృతుల గుంపు ఎవరో నీకు తెలుసు. గనుక సిద్ధము చేయగలవు. ఆదినుండి ప్రకటన వరకు నెరవేరిన సంగతులన్ని మా బైబిలులో ఆమేన్ అని వ్రాసికొనవలెను. మాకు ఆమేన్ అర్ధము తెలియకపోయినా, నీవు 'ఆమేన్' అని ప్రార్థించినావు ఆలాగే 'ఆమేన్' అర్ధము. ఇప్పుడు తెలిపినావు. మా ముఖ్యప్రార్ధనయైన 'రేప్చరు'లో

మాకు ఆమేన్‌గా నుందువనియు; అందు మేము 'ఆమేన్' అగునట్లుగా దీవించుమని వేడుకొనుచున్నాము. సైతాను, పాపము, నైజ శ్రమలు, మరణము మొ॥వాటిని జయించినావు. ఆ విధముగనే చెడుగును విడుచుటలో మాకు ఆశ కలిగించి, వాటినన్నిటిని జయించుటకు మాకు ఆమేన్ అయియున్నావు.

చిన్న పాపముంటే రాకడలోనికి వెళ్ళలేము, మంచి మరణము పొందలేము గాన చిన్నలోపమైన లేకుండ చేయుము. ఇట్టి విషయములలో ఆమేన్ అయియుండుము. ఇక్కడ మా ప్రార్థన నెరవేర్పు ఎప్పుడు సఫలమగునో అప్పుడు నిజముగా ఆమేన్ అయినదని సంతోషించగలము. వాగ్ధానములో నేరవేర్పు ఉన్నది. "వాగ్ధానములు జూడుడీ-దేవుని గ్రంథ...వాగ్ధానములే జరుగవలసిన కార్యముల్- వాగ్ధానములు నమ్మిడీ..॥బహుగా॥

నెరవేరకముందే నెరవేరినవని నమ్మినయెడల నెరవేరునని నీ వజ్రవాక్యమందు వ్రాసినావు. లోకములో ఉన్న గొప్ప దుష్టుడు సహితము, నేను లోకములో ఈ దుష్టత్వము మానలేను, గాని ఈ వాగ్ధానమును బట్టి మానగలనని అనుకొంటే అతడు రక్షణలోనికి రాగలడు. అన్ని వాగ్ధానములు ఈ వాగ్ధానములోనే నున్నవి. నేను ఎన్ని చేసిన నెరవేరలేదు గాని అన్ని ఒక్కసారే నెరవేరును అని చెంగు ముట్టుకున్న స్త్రీ బాగుపడినది. అట్లు ఇక్కడ నిలువబడి అనుకొన్న అన్నియు నెరవేరును. నాకు పెండ్లికుమార్తె సంఘస్థితి లేదు గాని ప్రభువు నాకు పాపముపై జయమిచ్చినారు గనుక

రాకడకు సిద్ధపర్చునని అనుకొన్న నెరవేరును. విశ్వాసులు యోహాను. 14:14 ప్రకారము ఆయన నామమున ఏమి అడిగిన నెరవేరును. మార్కు. 11:24ను బట్టి ఏ దుర్మార్గులను రక్షించినావో వారి నిమిత్తము స్తోత్రము. యోహాను 14:14బట్టి ఎందరి ప్రార్థనలు

నెరవేరినవో అట్టివారి విషయమై వందనములు. పరలోకములో మేము అనుభవించే మహిమలో అడిగిన దానికన్న ఎక్కువ ఇస్తాననా్నవు (ఎఫెసీ 3:21). ఆ ఎక్కువ మాకు తెలియదు. ఆ ఎక్కువకు నీవే ఆమేన్ అయినావు.

నిన్నుబట్టి సృష్టి వాగ్ధానము; నిన్నుబట్టి రక్షణ; నిన్ను బట్టి రేప్చరు కలిగినది. నిన్నుబట్టి అన్ని కలిగినవి. పాట: ఇమ్మిగ యేసుని బట్టి....నేడు నమ్మిన సర్వాంగ పుష్టి. ఆమేన్ అనగా ఇక జరుగబోయే పనులకు ఆమేన్. 'ఆమేన్' అయి ఉన్న యేసు నామమున వందించి వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమేన్.

రక్షణాపేక్ష పరులైన విశ్వాసులారా! రక్షణ పూర్తి చేసికొనవలెనని ఆశించుచున్నవారలారా! ఆమేన్ అయి ఉన్న తండ్రిని ధ్యానించుటకు వచ్చిన వారలారా! 'ఆమేన్' అయి ఉన్న తండ్రి, తన ఆమేన్ రూపమును నేడు మనకు ప్రత్యక్షపర్చునుగాక! ఆమేన్.

ఆదికాండము మొదలు ప్రకటన వరకు ప్రతి కథ చివర ఆమేన్! ప్రకటన చివర ఆమేన్. అన్నిటిలో ఆమేన్. ఎక్కడ చూచినా ఇశ్రాయేలీయుల చరిత్రలో, ప్రకటనలో బైబిలంతా, ఆమేన్. గనుక మన పనులకు, మన ప్రార్ధనలకు, స్తుతులకు, మన తలంపులకు, మన తలంపులో లేనివానికి ఆమేన్ అని వ్రాసికొనవలెను.

ఉదా:- అయ్యగారిని భోజనమునకు ఒకరు పిలిచెను. ప్రార్థింపగా ప్రతిమాటకు ఆమేన్ అనెను. నీరు త్రాగిన ప్రతిసారీ ఆమేన్ అనవలెను. ప్రతి వాక్యమునకు ఆమేన్ అనవలసినదే. ప్రతి విలాపమునకు, ప్రతీ ఆలోచనకు 'ఆమేన్' అనవలసినదే, ఆమేన్ లేకపోతే బ్రతుకులేదు.

వినండి, ఆలోచించండి, మనోనిదానము కలిగియుండండి. అందుకొనే శక్తితో కూర్చొనండి. ఏమి అందుకొనుట? స్వస్తతా?

అన్నమా? బట్టా (వస్త్రము)? జీతమా? ఉద్యోగమా? ఇవి అన్ని అయిపోయినవి. ఇది వరకు ప్రార్థనలో ఇవి అన్ని వచ్చినవి. ప్రార్థనలు వేరు, కనిపెట్టుట వేరు. ఏదైనా ఒక మీటింగులో ప్రార్థనలు అయిన తరువాత జరిగేది ఏదనగా, అందరూ ఎవరి ఇంటికి వారి దారిన వారు వెళ్ళిపోవుట జరుగును. కాని ప్రార్థన అయిన తరువాత ప్రభువు ఏమి చెపుతారో అని జవాబుకొరకు ఎదురు చూచుటే కనిపెట్టుట.

ఇంటికి వెళ్ళి ప్రార్థన చేసినపుడెల్ల కనిపెట్టుచున్నారా? కనిపెట్టండి. ప్రొద్దుట నుండి నాకొరకు కనిపెట్టితిరి. వచ్చితినిగదా! ప్రభువు కొరకు కనిపెట్టుట వల్ల కనబడాలా? వద్దా? రావాలా? వద్దా? కనబడవద్దా! మాటలాడవద్దా! ప్రశ్నలు వేయండి. అన్ని ప్రశ్నలు వేయలా! వద్దా! ప్రశ్నలు వేసిన తరువాత జవాబు చెప్పాలా! వద్దా?

కొందరు ధర్మగుణము కలవారు ఉన్నారు. చందా ధర్మముగా ఇచ్చేవారున్నారు. పేదలకు చందా ఇచ్చేవారు. సంఘమునకు సొమ్ము ధర్మము చేసేవారు ఉన్నారు. ఇంకొక ధర్మము చేసేవారు ఉన్నారు. అదేమిటంటే ఇక్కడ నేను చేసిన బోధలు అన్నీ, నాకు ఇచ్చి వెళ్ళిపోతారు. వారికి అంత ధర్మగుణము ఉన్నది.

ధర్మాత్ములు, ఖర్మాత్ములు, పుణ్యాత్ములను నమ్మకూడదు. ఒకవేళ ట్రైనులో సామాను పోయినట్లు నా బోధ కూడ పోవచ్చును గనుక జాగ్రత్త!

రాకడబోధ. ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను అని ప్రభువు చెప్పుచున్నారు. రెండువేల సం॥ల నుండి చెప్పుచున్నారు. ఇంకా రాలేదు, వస్తారు. ఆయన బోధ వచ్చినది గనుక ఆయన వస్తారు. నా బోధ ఉదయము నుండి వచ్చినది, నేను వచ్చితిని. ప్రభువు వస్తానని ప్రవక్తలద్వారా అపోస్తలులద్వారా పలికించినట్లు,

ఆయన వచ్చి తీర్తారు. ముందు ఆయన వాక్యము, తరువాత ఆయన వస్తారు. ఆయనకు చాలా బిరుదులు ఉన్నవి. బైబిలులో ఒక బిరుదు చెప్పండి. జవాబు: వాక్యము.

**వాక్యము:** వాక్యము ఏమిటి? వాక్యమనే బిరుదుతో బెత్లేహేములోనికి వచ్చెను. యోహాను 1:14, వాక్యము శరీరధారిగా వచ్చెను. ఇది మొదటి రాకడ వాక్యము. వాక్యము దేవుడైయుండెను. ఆయన వల్ల సమస్తము కలిగెను. ఆయన లేకుండ ఏమి కలుగలేదు. ఆ వాక్యం లేకుండ ఏమి కలుగలేదు (నాల్గింటికి 'వాక్కు' అని చెప్పండి)

ఆకాశమునకు భూమి ఎంతదూరమో; అక్కడున్న ఆ వాక్యము ఇప్పుడు లోకమునకు వచ్చిన తరువాత ప్రవక్తలు ఏ వాక్యము ప్రకటించిరో ఆ వాక్య పురుషుడు దిగివచ్చి వాక్యము బోధించెను. కొండపైనైతేనేమి, బేతనియలోనైతేనేమి, యెరూషలేములోనైతేనేమి, ఎఫ్రాయీము అడవిలోనైతేనేమి, గలిలయ సముద్రములో అయితేనేమి; స్మశానభూమిలో అయితేనేమి; జబ్బుపడిన వారివద్దకు, చనిపోయిన అమ్మాయి వద్దకు, గదిలో మోయబడుచున్న శవముయొద్దకు, సమాధియొద్దకు, శవము యొద్దకు వెళ్ళిన ఎక్కడకు వెళ్ళిన ఆయన వాక్యమైయున్నాడని చాల ఋజువుపరచియున్నాడు. భూతములను వెళ్ళగొట్టేటప్పుడు, చిన్నపిల్లలను దీవించేటప్పుడు, పండితుల ప్రశ్నలకు జవాబులు చెప్పేటప్పుడు, కొంతమందిని మత్తయి 13లో గద్దించేటప్పుడు ఆయన వాక్యమే అయి ఉన్నాడని ఋజువుపరచుకొన్నాడు. మత్తయి 18:20 ఇద్దరు ముగ్గురు ఉన్న వారియొద్దకు వస్తాను అన్నారు. లోకములోని భక్తులందరు ఆయన తలంపులో ఉన్నారు. ఆ వాక్కు వినేటప్పుడైతేనేమి ఆయన అందరికీ వాక్యమైయున్నాడు.

ముఖ్య అంశము విడిచితిని చెప్పండి ఆశీర్వాదము. అది ఇచ్చుటకు ఇప్పుడు వచ్చితిని అందుకే చిన్న ప్రసంగము చేసితిని. ఆశీర్వాదము పొందుటకు ఇష్టమున్నవారు మోకరించండి. దీవెన పొందే శిరస్సుపై చేతులు వేయుమంటే నా అలవాటులో ఏమిలేదు. ఆయన దీవించుటలోనే అంతయు ఉన్నది.

దీవెన అంటే అర్ధము ఏమిటి? అంటే మనము ఈ మూడు దినముల నుండి చేస్తున్నాము. పాడుతూ వింటూ, వ్రాసికొంటూ ఉన్న అన్ని పనులు సఫలము కావడము అదే దీవెన. ఎక్కడ అయినా అంతే. అన్ని పనులు అయిన తరువాత దీవెన. ఎందుకంటే అన్నీ నెరవేరుటకు. బైబిలులో ఒకచోట దీవించినట్లు ఉన్నది. ఆరురోజులు అయిన తరువాత దేవుడు దీవించెను. ఆది. 1:28 అది మొదటి దీవెన. చివరి దీవెన. ఆరోహణము అప్పుడు ఇచ్చిన దీవెన. ఆలాగు దీవించి దీవిస్తూ-దీవిస్తూ-దీవిస్తు సింహాసనముపై కూర్చుని నేటివరకు దీవిస్తూనే యున్నాడు. ఇవి ఎప్పుడైనా విన్నారా! ప్రతిరోజు అందుకొంటే దీవిస్తాడు.

ఆదివారము గుడిలో ఆఖరున పాదిరిగారు నిలువబడి అందరిని ఒక్కసారే దీవిస్తారు. నేను ఈ వేళ నా సొంత పద్ధతి ఒకటి చేస్తాను. దీవెన సమయములో వేరే తలంపు ఉంటే దీవెన అందుకోలేరు. నేను ప్రార్ధన, దీవెన కలిపి చేస్తాను.

**దీవెన ప్రార్థన:-** యేసుప్రభువా! నీవు చిన్న పిల్లలను దీవించినట్లును, కొండమీద 11మందిమీద దీవించినట్లును ఈ మీటింగులకు వచ్చిన చిన్న పిల్లలను, పెద్దవారిని దీవించుము. నీవు దీవించేటప్పుడు, పాదుర్లకు ఆర్డినేషన్ ఇచ్చే సమయమప్పుడు ఇద్దరు ముగ్గురు పాదుర్లు విద్యార్ధి శిరస్సుపై చేతులు వేస్తారు. ఇక్కడ ఉన్న ప్రతి వారిపై మీ చేతులు వేయుము, దీవించుము.

ఎవ్వరిని విడిచిపెట్టవద్దు. ఆర్డినేషను దినమున అధమపక్షము ప్రతి ఒక్కరి శిరస్సుపైన చేతులువేస్తారు. ఆలాగే వీరందరిమీద నీవు చేతులువేస్తే, నా ఆత్మయొక్క చేతులు చాపి అందరిమీదకాదు ఒక్కొక్కరిమీద చేతులువేసి దీవిస్తాను గనుక వీరు దేవునిదీవెన, దేవుని సేవకుని దీవెన కూడా పొందగలరు. ఎందుకంటే భూమిమీద ఉన్నప్పుడు నీవు అన్నావు. మీరు వారిని దీవించండి; అపుడు నేనును దీవిస్తాను అని. ఒక స్థలములో నీవు అన్నప్పటికిని, "దీవించండి" అన్నావు గనుక అదే నా అధారిటీ (Authority). ఆ హక్కును బట్టి వీరిలోని ఒక్కొక్కరిమీద చేతులువేసి దీవిస్తాను గనుక నీవునూ దీవించుము.

1. యేసుప్రభువా! ఇక్కడ తగని వారు ఉన్నారు. మాకు తెలుసు. వారి శిరస్సుమీద నా చేతులు వేస్తున్నాను. నీ చేతులు కూడవేసి, దీవించుము.

2. రెండవ దీవెన ఏదనగా ఈ వరండామీద తగినవారున్నారు. వారిని నేను దీవిస్తున్నాను. నీవు కూడా దీవించుము.

3. దీవిస్తూ ఉండగా మంచివారు భక్తులు సైతము అందుకోలేకపోతున్నారు. వారినికూడా దీవించుము. అందుకొనే శక్తి కలిగేటట్లు నేను వేడుకొనుచు, దీవిస్తున్నాను.

4. భూలోకమందంతట ఉన్న క్రైస్తవ సంఘములో ఉన్న ప్రతివారిమీద నాచేతులు వేసియున్నాను, నీ చేతులుకూడ ఉన్నవి గనుక దీవించుము. ఆ సంఘములును పెండ్లికుమార్తె సంఘములు అయ్యేటట్లు దీవించుము.

5. సంఘములో చేరనివారు చాలమంది ఉన్నారు. వారందరి శిరస్సులమీద నేను నా చేతులు వేసియున్నాను. నీ చేతులుకూడ వారిపైనున్నవి గనుక వారు నిన్ను అంగీకరించేటందుకు దీవించుము. నేను దీవిస్తున్నాను.

6. పాతాళ లోకములో మారుమనస్సులేని మృతులు ఉన్నారు. వారినికూడ దీవించుటకై నా చేతులు వారి శిరస్సులమీద వేసినాను. నీ చేతులుకూడా ఉన్నవి గనుక వారిని దీవించుము.

7. నరుల కొరకు నీవు సృజించిన సూర్యచంద్ర నక్షత్రములను, వర్షమును, గాలిని, జీవరాసులను, చెట్లను, మనుష్యులు కల్పించుకొన్న పాత్రలు, బండ్లు, విద్యలు మొదలైన వాటిమీదను, భూగర్భములో ఉన్న ఖనిజముమీదను నా చేతులు ఉంచినాను, నీచేతులుకూడ ఉన్నవి దీవించుము. అవి నరులయొక్క ఉపయోగము నిమిత్తమై వాడుకొనునట్లు దీవించుము.

8. తండ్రీ! నీవు భూలోకములో ఉన్నప్పుడు ఏమన్నావు? ఇక్కడ నీవు దేనిని బంధిస్తావో, పరలోకములో దానిని కట్టివేస్తాను. భూలోకములో ఏ కట్లు విప్పుదురో ఆ కట్లు నేను విప్పివేస్తాను గనుక నేను ఆత్మ చేతులను ఎవరిమీద వేస్తానో, వారి శత్రువులమీద ఇష్టములేనివారిమీద వారికున్న బంధకములను విప్పివేయుము. కట్టివేయవలసినవి కట్టివేయుము. నీవాగ్దాన దీవెనల వలన ఆలాగు చేయుము. ఈ నా మాటలు నమ్మేవారికి, ఈ వేళ రాకపోతే, రేపు తప్పక నెరవేరును. కారణము ఏదనగా, 1) నీ వాగ్ధానము 2) నీవు దీవిస్తున్నావు 3) నీ బదులు నేను లోకములో దీవిస్తున్నాను. ఈ మూడు కారణముల వలన దీవెనలు కలుగును. నమ్మేవారికి దీవెనలు కలుగునట్లు దీవించుమని నీ ఘన నామమునుబట్టి త్రియేక త్రిత్వ జనకుడవైన సృష్టికర్తా! నీ దీవెన మా శిరస్సులమీద ఎప్పుడు రేయింబగళ్ళు; మేము నిద్రపోయినపుడు ఆకాశము ఎట్లు మెళకువగా ఉండునో అట్లే నీ దీవెనకూడా మాపై ఉండవలెనని వేడుకొనుచున్నాను. ఆమేన్.

# క్రిష్టాఫర్

వాక్యానంద ప్రియులకు, ఆత్మ తండ్రి తాను సిద్ధపర్చిన ఆత్మీయ విందును అనుగ్రహించి, క్రీస్తును మోయుగల ధన్యతనిచ్చునుగాక! ఆమెన్.

బైబిలు గ్రంథములో 'ఆయనను మోసిన గర్భము' అని స్పష్టముగా ఉన్నది. అయితే, బాప్తిస్మ కాలములోనే క్రీస్తును ధరించుట అనునది మర్మముగా ఉన్నది (గలతీ 3:27); గనుక నేడు క్రీస్తును మోయుట, క్రీస్తును మోయుట, క్రీస్తును ధరించుట అను క్రిష్టాఫర్ పాఠమునుగూర్చి నేర్చుకొందాము. బైబిలంతటిలో క్రీస్తును మోసినవారే ధరించినవారే. క్రిష్టాఫర్‌లు. వారిని గూర్చి బాగా తెలుసుకోవాలంటే బైబిలు బాగా చదవాలి.

బైబిలు మీరు చదివిరి. గాని కనిపెట్టలేదు. బైబిలులోని మర్మములు, ధర్మములు కనిపెట్టకుండా ఊరికినే చదువుకుంటుపోతే అది బైబిలు చదువుటకాదు. బైబిలు చదవడానికి రెండు పద్ధతులున్నవి. 1) పారాయణము 2) అధ్యాయనము.

ఈ రెండు మాటలు హిందువులు వారి వేదము చదివేటప్పుడు వాడేమాటలు. ఒక బ్రాహ్మణుడు అరుగుమీద కూర్చుండి వేదము చదువుతుంటే, మరొక బ్రాహ్మణుడు వచ్చి దారిని వెళ్లుచు ఆగి అయ్యా! మీరు పారాయణము చేస్తున్నారా? అధ్యాయనము చేస్తున్నారా? అని అడుగుదురు. పారాయణ మేనంటే సరే అని అంటారు. మరొక రోజున అదే బ్రాహ్మణుడు వచ్చేటప్పుడు అడిగితే అధ్యాయనమని జవాబు చెప్పవచ్చును. అప్పుడాయన అరుగుమీద కూర్చుండి నేను వింటాను అధ్యాయనమేలాగు చేస్తున్నావో, చూస్తానన్నారు.

పారాయణమంటే నక్కులు, నక్కులు లేకుండా ధారాళముగా చదవడం. ఇప్పుడు పాఠములోనికి వెళ్లెదము. ఇప్పుడు పాటములోనికి వెళ్ళెదము. యోహాను. 14:10-17. ఆయన (1) మీతోకూడా నివసించును. (2) ఆయన మీలో ఉండును. అనగానేమి? మీతో ఉండుట అనగా మన ప్రక్కను మనదగ్గర ఉండి కాపాడుట. మీలో ఉండుననగా మనలో ఉండుట. **అదే క్రిష్టాఫర్** ఆయన మనలోనికి వస్తే మనము మోస్తాము. ఆయన మనలో ఉంటేనే ఆయనను మోస్తాము. ***మనదగ్గర ఉన్న ఆయన మనలోనికివస్తే ఆయనను మనము మోసేవారమగుదుము.*** కాబట్టి మనము క్రిష్టాఫర్‌లమైయున్నాము. అది మర్మముగాయున్నది. మీలో, మీతో అను ఈ రెండు అనుభవములు సుందర్‌సింగ్‌గారి అనుభవములో ఉన్నవి.

ఆయన మనలోకి వచ్చినట్లు ఎవరికైన అనుభవమున్నదా? మనలో ఉండకపోయినా మనతో ఉండును. ఉన్నాడుగదా!

బైబిలులో ఎక్కడైనా క్రిష్టాఫర్ అనేమాట ఏవచనములో నైన ఉన్నదా? యోహాను 14:3లో. ప్రభువు మనము ఒక్కచోటనే ఉందుము. ఇదియు ఒక విధముగా క్రిష్టాఫర్‌నే సూచించుచున్నది. ఆ భావము ఇక్కడ మర్మముగా యున్నది.

**యం. దేవదాసు అయ్యగారి అనుభవము:-** ఇది చాలా కాలము క్రింద ఉన్న అనుభవముకాదు. అది వేరే. అది ఉన్నా ఇప్పుడు చెప్పనుగాని పోయినవారపు అనుభవము. ఇది క్రిష్టాఫర్ అనుభవమునకు తగినది. మీకును అదే ఉండాలని కోరుచున్నాను. ఇది సన్నిధి కూటస్తులకు చాలా సులువు. పోయివారము అయ్యగారు తన స్వంత అనుభవములను గూర్చి పరుండి ప్రార్థించుచున్నాము. ప్రభువు వచ్చి చాలా సంగతులు మాట్లాడి 1) 'నీ హృదయము దుఃఖముతో నిండియున్నది అని

నాకు తెలుసు. 2) నేను నీకు తోడైయుండుట మాత్రమేగాక నీలోకూడా ఉన్నాను' అన్నారు. ఆ మాట చెప్పేసరికి అయ్యగారికి చాలా బలము వచ్చింది.

ఆయన నాకు తోడైయుండుట. చుట్టు ఉండి కాపాడుట. నాలో ఉన్నారు అనగా నాలోనే బస చేయుట. అప్పుడు నేను ప్రభువును మోసినట్టుకాదా. అది బైబిలు వాక్యముకాదు. అయ్యగారి అనుభవమునకు సంబంధించిన అనుభవము. మీలో ఎవరికైన మీతో ఉండడము మాత్రమేకాదు మీలో ఉన్నానని ఎవరికైనా ఆయన చెవులకు వినబడిన స్వరముతో ప్రభువే స్వయముగా చెప్పినట్లు తెలియునా? ఆ అనుభవము కలిగినవారు చేతులెత్తితే వినేవారికి ప్రేరేపన కలుగును.

'నేను లోకమునకు వెలుగైయున్నాను' అని ఆయన అన్నారు. ఆ వెలుగు క్రీస్తే. ఆ వెలుగునకు సంబంధించిన మాట బైబిలులో ఎక్కడున్నదనగా క్రిష్టాఫర్‌ను జ్ఞాపకము తెచ్చి, ఆ మాటలోనే వెలుగు యున్నది అని ప్రభువు వివరించారు. **తో, లో,** తో=మనతో, మనతో ఉండి సహాయము చేయుట. అది అవసరమే. లో = మనలో ఉండడము ఎందుకంటే ఆయన సమస్తమైన ఐశ్వర్యమును మనము అనుభవించుటకు మనలో ఉండడము.

యెష. 14:10-12. పరలోకమందు దేవునియొక్క సింహాసనముయొద్ద ప్రధానదూత ఉండేవాడు. అతడు తప్పిపోయినాడు గనుక సింహాసనము దగ్గరనుండి వాయు మండలమునకు పడిపోయినాడు. అందుచేత అతనికి ఆది సర్పము, సైతాను, క్రీస్తువిరోధి అనుపేర్లు ఉన్నాయి. సింహాసనము వద్ద ఉన్నపుడు లూసిఫర్ అనే పేరున్నది. లూసిఫర్ అనగా తేజోనక్షత్రము అని అర్ధము. తేజోమయముగా ఉన్న నక్షత్రమైయున్న ఆ నక్షత్రము = ఆ దూత పడిపోయి, అంధకార

స్థితిలోకి వచ్చి ఇప్పుడు అక్కడే భద్రము చేయబడి ఉన్నాడు. ఇది సృష్టికి ముందు జరిగిన కథ. ఎంత గొప్ప ధన్యత పోగొట్టుకొన్నాడు!

1. సింహాసనము దగ్గరుండే ధన్యత పోగొట్టుకున్నాడు,

2. ప్రధానదూత అనే ధన్యత,

3. ప్రధానదూతలలో ఒకదూత అనే ధన్యత,

4. తేజోమయ నక్షత్రమనే ధన్యత; ఈ నాలుగు ధన్యతలు పోగొట్టుకొన్నాడు. ఇదే దుఃఖకరమైనది.

తేజోనక్షత్రము = వేకువచుక్క. ఈ వేకువచుక్క అనేపేరుగలవాడు యేసుప్రభువు అని అర్ధము. లూసిఫర్‌కు దేవుని సింహాసనము దగ్గరున్నపుడు వేకువచుక్కని పేరు. ప్రధానదూతకు సింహాసనము దగ్గర వేకువ చుక్క అనేపేరు ఉండేది. ప్రభువుకు కూడ వేకువచుక్కనిపేరు. ప్రధానదూత ప్రభువులోను, ప్రభువు ప్రధానదూతలో ఉండేవారుకూడా. ప్రధాన దూత దగ్గర ప్రభువు, ప్రభువు దగ్గర ప్రధానదూతలో ఉండుట: ప్రధాన దూతలో ప్రభువు, ప్రభువులో ప్రధానదూత ఉండేవారు. ఆలాగే మనుష్యులమైన మనతోను, మనలోను దేవుడుంటున్నాడు. బాప్తిస్మమునుండి అది తెలియుటలేదు. ఇద్దరు ముగ్గురున్నా చోట నేనున్నానన్నారు. అది మనతో ఉండుట. అయితే, ఆత్మ బాప్తిస్మము పొందిన పిమ్మట, ఆయన కుమ్మరింపుగా మనలోనికి వస్తున్నారు. అది మనలో ఉండుట. అదే ఏకమైయుండుట. అదే క్రిష్టాఫర్ వరుస. అయితే యెష. 14:12లో మర్మముగా ఉన్నది.

సైతానుకు 1. మొదట క్రిష్టాఫర్, 2. లూసిఫర్ అనే రెండు పేర్లున్నవి. క్రిష్టాఫర్ కథ ముగిసింది.

లూసిఫర్ అనగా వేకువచుక్క. క్రిష్టాఫర్ అనగా ప్రభువును మోసినవాడు. అక్కడ ఫర్, ఇక్కడ ఫర్, ఉన్నది. **అధ్యాయనమనగా ఇది తెలిసికొనుటే** ఇంతవరకు బైబిలు చదువుట

పారాయణము యెష. 14:12 ఎన్నోసార్లు చదివినాము, పారాయణము చేసినాము. పారాయణము అనగా ఊరకనే చదువుకుపోవడము. తెలుగు బైబిలులో వేకువచుక్క అని ఉంటే బాగా తెలిసేది.

మా నాన్నగారు రామాయణము అనర్గళంగా అనగా ఎక్కడ తప్పులు లేకుండా అప్పగించేవారు. అనర్గళం అధ్యాయనము అనుమాటలోనుండి వచ్చినమాట అని మీకందరికి తెలుసు. అధ్యాయము, అదే అధ్యాయనము అనగా నేర్చుకొనుట అని అర్థము. మీరు నాయొద్ద నేర్చుకొనుడి అని ప్రభువు అన్నారు. అదే అధ్యాయనము గనుక మనము బైబిలు అనర్గళముగా చదువవచ్చునుగాని పూర్తిగా ప్రభువు వద్దనుండి నేర్చుకోవాలి.

ఎవరైనా బైబిలును అపశబ్దములు, నక్కులు లేకుండ చదివేవారెవరైనా ఉన్నారా? ఉంటారా? నక్కులు, అపశబ్దములు, తప్పులు లేకుండా వరుసగా చదవాలి. కొందరు మొదటి పంక్తి చదివి రెండు వదలి మూడు చదువుతారు. ఈలాగు చదివేవారు చాలామంది ఉంటారు. తప్పులేకుండ చదివేవారు రాజమండ్రి లూథర్‌గిరిలో ముగ్గురున్నారు. 1. జేమ్స్ పాదిరిగారు 2. రిచర్డ్ జేమ్స్ పాదిరిగారు 3. బెంజిమన్ పాదిరిగారు. ఆలాగు చదువుటకు నేర్చుకొనండి. అప్పుడు దేవుని వాక్యము మనలోనికి వచ్చినట్లు. ఆదియందు వాక్యముండెను. ఆ వాక్యము దేవునియొద్ద ఉండెను. ఆ వాక్యము దేవుడైయుండెను. అదే క్రిష్టాఫర్.

పారాయణము వల్ల, అధ్యాయమువల్ల వాక్యము మనలోనికి వచ్చును. ఆ వాక్యమే దేవుడై యుండెను. అదే ఆయనను మోయుట. కాబట్టి మీరందరు దేవుని వాక్యమైయున్న బైబిలును మోసేవారును, ఆ ప్రకారముగా క్రీస్తును మోసేవారును,

తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను త్రియేకదేవుని మోసేవారగునట్టి ధన్యత కలుగును గాక!. ఆమేన్.

ప్రభువు మీతో, మీలో ఉన్నారనే తలంపు కలిగి ఉండండి.

1. జబ్బులున్నవారలారా!

2. అప్పులున్నవారలారా!

3. ఇబ్బందులున్నవారలారా!

4. పిల్లలనుగూర్చి విచారించుచున్నవారలారా!

5. అవమానములపాలైనవారలారా!

6. తలంచిన పని సఫలముకానివారలారా!

7. సంతానము కావలసినవారలారా!

8. అప్పుడప్పుడు అవిశ్వాసము కలవారలారా! క్రిష్టాఫర్ పాఠమును తలంచుకొని, ఆయన మీతోను, మీలోను ఉన్నారని నమ్మండి. అప్పుడు మీ కొరతలు, కష్టములు అన్నియు కదురుకొనును. రావల్సిన మేళ్ళు కలుగును. అన్నిటికంటె ముఖ్యముగా, ఆయనయే మీలోనికి వచ్చివేయును. గనుక ఇన్నిబోధలు విన్న తరువాత అవిశ్వాసముంటే అది అపాయము.

యేసుప్రభువునుగూర్చి సాక్ష్యము చెప్పేశక్తి, ధైర్యము లేనివారున్నారా? ఈ పాఠము నమ్మండి. అపుడు మీకు సాక్ష్య శక్తి, ధైర్యము కలుగును.

***సైతానును దిట్టంగా దౌడుతీసి, పరుగెత్తించే ధైర్యశాలులు ఉన్నారా?*** అయితే అన్నిటికొరకు ఇపుడు ప్రార్థన చేతును. ఈ అవస్తలుకాక క్రొత్త అవస్థలున్నవా?

**ప్రార్థన:-** దయారసముగల తండ్రీ! నీవెంత గొప్పవాడవో, నీవెంత దయగలవాడవో మాకు తెలుసును. అందుచేతనే నీవు మాతోను, మాలోను, మాకొరకును ఉన్నావు అనే సంగతి ఈ దినములలో

జ్ఞాపకము తెచ్చుకొని నిన్ను వందించుచున్నాము. యేసుప్రభువా! మాకొరకు పుట్టినావు, మాకొరకు బోధించినావు, మాకొరకు కష్టపడ్డావు, మా కొరకు సిలువ మరణముపొందినావు, మా కొరకు భూస్థాపన అయినావు, మాకొరకు సిలువ మోసినావు. **"మీరును నాకొరకు సిలువమోయండని చెప్పినావు.** నా కాడి సులువు". అన్నావు కాబట్టి నీకు వందనములు. ఇన్ని బోధలు విన్న తరువాత మా హృదయములో చిన్న కళంకమైన ఉండకూడదు. ఇప్పుడు ప్రార్థనకోరే వారందరి హృదయములోనుండి ఈ చెత్త అంత తుడిచివేయుమనియు, వారి కోర్కెలన్నియు నెరవేర్చుమనియు ప్రార్థించుచున్నాము.

## తైలమును గూర్చిన ప్రార్థన:-

తండ్రీ! ఈ తైలము నీవు చెప్పిన తైలము. తైలము ఎంత బజారులో అమ్మిన, అమ్ముచున్న తైలమైనా బైబిలులో నీవు వ్రాయించినది కాబట్టి అది అన్ని అవస్థలకు సరిపడిన ఒకటే తైలము. వీనికిమించిన తైలము బైబిలులో ఎక్కడనులేదు. గాని పరిశుద్ధాత్మ అభిషేకతైలము, ఆనందతైలము, ఆత్మీయ తైలమైయున్నది. మాది శరీరతైలము. కాబట్టి ప్రభువా! ఇది సరిగా వాడుకునేటట్లు, పూర్వము దీవించినట్లుగా ఇప్పుడుకూడా ఈ తైలమును దీవించుము, మేము మరచిపోయిన మనవులుకూడా ప్రార్థనలో పెట్టినట్లుగానే భావించుము అని వేడుకొంటున్నాము. ఆమేన్.

# సిలువ - నేను (CROSS- SELF)

**'నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడి యున్నాను' గలతీ. 2:20.**

వాక్యాసక్తిగల ప్రియులారా! క్రీస్తు సిలువానంద ప్రియులారా! శ్రమల ధ్యాన దీక్షాపేక్ష పరులారా! మీకు క్రీస్తు సిలువను ధ్యానించి, శరీరమును సిలువవేయు భాగ్యము కలుగును గాక. ఆమేన్.

నేటి దినము ఈ శరీరమును సిలువవేయుకొన్ని ప్రత్యేక అంశములను ధ్యానించెదము.

పై వచనమునుబట్టి పౌలు 'నేను' అనువానిని సిలువవేస్తున్నాడు. ప్రధాన దూతయైన లూసిఫర్ 'నేను ఆకాశమునకు ఎక్కిపోయెదను' యెష. 14:13 అని అనుకొనెను. వెంటనే దేవుడు గర్వించిన ఆ దూతను క్రిందికి పడవేసెను.

2. గొల్యాతుకూడ ఇశ్రాయేలీయులను బెదిరించాడు. 'యుద్ధపంక్తులు తీర్చుటకై మీరెందుకు బైలుదేరి వచ్చితిరి. నేను ఫిలిష్తీయుడనుకానా? నేను అతనిని జయించి చంపిన యెడల మీరు మాకు దాసులై దాసత్వము చేయుదురు. ఈ దినమున ఇశ్రాయేలీయుల సైన్యములను నేను తిరస్కరించుచున్నాను' 1సమూ. 17:8-10 అంటూ తన్నుతాను పెద్ద చెసికొంటూ ముందుకు వస్తున్నాడు గొల్యాతు. నేను అనే దానిమీద ఆధారపడి వస్తున్నాడు.

3. దావీదు నేను అను వానిని చంపాలి నీవు తిరస్కరించిన ఇశ్రాయేలీయుల సైన్యముల కధిపతియగు యెహోవా పేరిట నేను నీ మీదికి వచ్చుచున్నాను అంటూ తన్ను తాను మరచిపోయి దేవుని పేరిట గొల్యాతును సునాయాసముగా

చంపగలిగెను. ఆలాగే మనమును నేను అనే వానిని చంపివేయవలెను.

4. నేను అనేవానిని పెంచి పెద్దచేసేది శరీరము, గనుక శరీరమును అణచినచో నేను అనేవానికి చావు మూడినట్లే అగును. మనలను పాడుచేసేది శరీరమే. అది ఒకనిని గర్వింపచేస్తుంది, ఉన్నదానికంటే అధికంగా చూపించుచున్నది. ఒక గదిలో 1000 అద్దములుంటే ఒకడు ఒకేసారి ఆ 1000 అద్దములలో కనిపిస్తాడు. అలాగు శరీరము ఒకనిని హెచ్చించుచున్నది. ఒకనికి ఉన్న అతిశయమంతా తన శరీరమునుబట్టియే కలుగుచున్నది. Selfishness is specialist అనగా శరీరము నేను అనువానికి నిపుణుడు గనుక మొదట శరీరమును అణచవలెను. దానిని మనము నిర్లక్ష్యపెట్టవలెను. పౌలు అన్నట్లు శరీరానుసారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్తులముకాము. (రోమా. 8:12) అని శరీరమునకు ప్రాధాన్యత ఇవ్వకుండా మానవలెను. ***కులమునుబట్టిగాని, నాగరికతనుబట్టిగాని, అంతస్తునుబట్టిగాని శరీరమునకు ప్రాధాన్యత లేకుండా చేయవలెను.***

5. కోరలు తీయబడిన పామువలె శరీరము ప్రాధాన్యత లేనిదిగా విడువబడవలెను. శరీరమందేదైనా మంచి ఉన్నదా? ఉంటే అందులో ఏమియు లేదు. 'నాయందు అనగా నా శరీరమందు మంచిదేదియు నివసింపదని నేను ఎరుగుదును' రోమా. 7:18 అని పౌలు స్పష్టముగా చెప్పుచున్నాడుగదా! మంచి చేయాలి అని అనుకున్నాను గానీ నా శరీరము చేయనీయదు గనుక శరీరముయొక్క తత్వమును బాగుగా ఎరిగినవారమై, మనము శరీరమును ఆస్పదముచేసికొనకూడదని ఫిలిప్పీ. 3:3లో పౌలు తెలియజేసెను. We have no confidence in flesh

"విశ్వాసరాహిత్య తీర్మానమును" శరీరముమీద పౌలు ప్రకటించుచున్నాడు. శరీరము నమ్మకమును పోగొట్టుకొన్నది. శరీరమును అణచు విధమేది? ఆత్మచేత శరీర క్రియలను చంపివేసినయెడల జీవించెదరు (రోమా. 8:13). శరీరమును అణచేవిధము లేకపోలేదు. అనేకులకు బోధించిన తరువాత నన్ను నేనే నలుగగొట్టుకొనుచున్నాను అని పౌలు చెప్పుచున్నాడు (1కొరింథి. 9:27).

6. ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచి కొంతదూరము ప్రయాణముచేసి, రెఫీదీము అరణ్యములో దిగిరి. అంతలో అమాలేకీయులు అడ్డువచ్చి ఇశ్రాయేలీయులు సాగిపోకుండా వారితో యుద్ధము చేయనారంభించిరి. అంతట మోషే తెలియజేసినట్లు యెహోషువా వారితో యుద్ధమారంభించెను. మోషే దేవునికర్ర చేతపట్టుకొని శిఖరముమీద నిలిచెను. మోషే తన చెయ్యి పైకెత్తినప్పుడు ఇశ్రాయేలీయులు గెలిచిరి. మోషే తన చెయ్యి దించినపుడు అమాలేకీయులు గెలిచిరి. మోషే చేతులు బరువెక్కగా అహరోను, హూరులు ఒక రాయి తీసికొని వచ్చి మోషే కూర్చుండుటకు వేసిరి. అహరోను, హూరులు కుడి ఎడమల చేతులు పట్టుకొనిరి. మోషే చేతులు నిలిపి ఇశ్రాయేలీయులకు జయము సమకూర్చిరి. ఇందులో గొప్ప సత్యము గలదు. అమాలేకీయులు ఇశ్రాయేలీయులకు బైట శత్రువులు. కనాను దేశము వెలుపల శత్రువులు. కానాను దేశములోని 7 జనాంగములలో శత్రువులు లోపలి శత్రువులు. అయితే మన శరీరమే మన అమాలేకీయుడు. మొదట మనము జయించవలసిన మొదటి శత్రువు శరీరమే. చేతులెత్తుటద్వారా మోషే ఇశ్రాయేలీయులను జయించునట్లు చేసెను. చేతులెత్తుట

అనగా ప్రార్థించుట. ప్రార్థన ద్వారానే శరీరము, దాని క్రియలు నాశనమగునుగానీ వేరే మార్గములేదు. ప్రార్థన ద్వారానే శోధనలను జయింపవచ్చును. అమాలేకీయులు తమ చేతిని ఇశ్రాయేలీయులకు విరోధముగా ఎత్తిరి. గనుక యెహోవాకు అమాలేకీయులతో తరతరములవరకు యుద్ధమనెను నిర్గ. 17:16. అలాగే నిరంతరము ప్రార్థించుచుండిన యెడలనే శరీరమును మనముకూడ జయించగలము.

7. పాత ఆదాము అనగా ముసలి ఆదాముకూడా అప్పుడప్పుడు పైకి వచ్చుచుండును. ముసలివారుకూడ అప్పుడప్పుడు ఇతరులవలె ప్రవర్తించెదరు, అందుకనే శరీరమును కనిపెట్టుచుండవలెను. గిద్యోను మొదలు అమాలేకీయులను నాశనము చేస్తునే వచ్చిరి. అయితే సౌలు మాత్రము దైవాజ్ఞ ప్రకారము అమాలేకీయులనందరిని హతముచేయ గలిగినను, రాజును ప్రాణముతో బ్రతుకనిచ్చెను. అందుకని దేవుని కోపము సౌలుమీద రగులుకొనెను. దావీదైతే అమాలేకీయులనందరిని, సౌలు మరణ వార్త తీసికొని వచ్చిన ఆఖరు అమాలేకీయునితో సహా చంపినందున హెబ్రోనును స్వాస్థముగా పొందెను. **హెబ్రోను అనగా దేవుని సహవాసము.** శరీరమును ప్రార్థన, దైవ సహవాసముద్వారా మొదలగు వాటిచేత జయింపవలెను. అప్పుడు యోహానువలె దేవుని భుజముమీద మనమానుకొనగలము. దైవ సహవాసములో ప్రవేశింపగలము. ఇట్టి భాగ్యము మనకందరికి ఆత్మ తండ్రి సహాయమున సహవాసమున లభించునుగాక! ఆమేన్.

# శిరోరక్తధార

## కీర్తన. 116:1; యోహా. 12:1; 1కొరింథి. 6:14.

ప్రార్ధన:- పైనుంచి వచ్చిన మా తండ్రీ! క్రింద భూమిమీద కొంతకాలము శ్రమ పడిన ప్రభువా! ఆ శ్రమలనుగూర్చి మా జీవితకాలమంతయు ధ్యానించుటకు సమయము ఇచ్చిన ప్రభువా! నీ శ్రమలను ధ్యానించుట మాకు శ్రమకాదుగాని, సంతోషమే. కాబట్టి నీకనేక వందనములు. ఈవేళకూడ ఆలాగు ధ్యానించుటకు మమ్ములను ప్రేరేపించుమని సిలువమీదనున్న ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

ప్రియులారా! ధ్యానపరులారా! మనలను తన సిలువ ధ్యానములోనుంచిన ప్రభువు జీవిత చరిత్ర ధ్యానించుటకు నేడు మనకు కృప కలిగియున్నది. గనుక ధ్యానము చేయుదము. పైనుండి వచ్చిన యేసుప్రభువుయొక్క సిలువ చరిత్ర పైనుండియే ధ్యానించుదము. సిలువవైపు మనము చూస్తు ఉండగా కొన్ని రక్త ధారలు, మనకు కనబడుచున్నవి. మొదటి రక్తధార శిరో రక్తధార, రెండవది హస్త రక్తధార, మూడవది పాద రక్తధార, నాలుగవది ఉదర రక్తధార.

**1. శిరో రక్తధార:-** మనము ఈ 4 రక్తధారలను గురించి ధ్యానించుదము. శిరో రక్తధార అనగా ఆయన తలలోనుండి ప్రవహించిన రక్తధార. నేను మీకు ఉపదేశమును చేయు నిమిత్తము ఇక్కడ ఒక సజ్జనుని చూపించుచున్నాను. ఆ ప్రక్కను ఒక దుర్జనుని చూపించుచున్నాను. మధ్యను యేసుప్రభువును చూపించుచున్నాను. ఈ సజ్జనుడు తన సజ్జనత్వమును

కనబర్చినందుకు కఠినమైన శ్రమ ఈలోకములో పొందుచున్నాడు. అక్కడ దర్జనుడు ఉన్నాడు. అతడుకూడా శ్రమపడుచున్నాడు. ఇతడు తన సజ్జనత్వమువలన శ్రమపడుచున్నందుకు సంతోషించుచున్నాడు. ఆ దుర్జనునికి ఆ సంతోషములేదు. తన దుష్టత్వము, చెడుగు మాత్రమే జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. ఈ సజ్జనుడు మంచి తలంపే తలంచేవాడు. ఇతరులను గురించి మేలు ఎక్కువగా కోరేవాడు. తన చూపువల్ల ఇతరులమీద తనకు జాలి ఉన్నదని కనబర్చేవాడు. ఈ సంగతులు విన్నందువల్ల ఇతడు ఇతరులయెడల జాలి గలవాడనియు, దుర్జనుడు ఇతరులతో కలసి కలహించువాడనియు కనబడుచున్నాడు. ఈ సజ్జనుడు అందరితోను మాట్లాడునప్పుడు మంచి మాటలేగాని అపవిత్రమైన మాటలు మాటలాడువాడు కాడు. అతని శిరస్సు మంచిది, క్షేమకరమైన తలంపులుగలది, జాలి గల చూపు గలది, మొర్ర ఆలకించే చెవి గలది. అందరితో బాగా మాట్లాడే మాట్లాడగల నాలుక గలవాడు. కాబట్టి అందరు మెచ్చుకొంటారు. ఇతడు తన తలకు కిరీటము ధరించుట తగినవాడు. ఆ చివరిలో నున్నవాడు ఇవి లేనివాడు. క్షేమము కోరే తలంపులు, చూపులు, మాటలు ఇతరులయెడల దయచూపే చూపు, ఇతరుల మొర్రను జాలితో ఆలకించే చెవి, మంచిమాటలు పలికే నాలుక కలవాడు కాడు. ఇతని ఐదు అవయవములకు మంచిచేయు శక్తిలేదు.

యేసుప్రభువు నీతిపరుడైన మనుష్యుడు, దేవుడు. ఈ సజ్జనునికి రావలసిన మెప్పుకంటే ఈయనకు ఎక్కువ మెప్పు రావలసి ఉన్నది. ఆలాగున రాక ఆయనకు కిరీటము వచ్చినది. ఆ కిరీటము మెప్పు కలిగించే రాజ కిరీటముకాదుగాని రక్తము కార్చే ముండ్లకిరీటము. ఆ ముండ్ల కిరీటము మన నిమిత్తము

పొందినాడు గాని తన నిమిత్తమై కాదు. ముండ్ల కిరీటమనగా తుమ్మ ముండ్లు, ఈత ముండ్లు కావు. మేకులతో చేయబడిన ముండ్లు. ఆలాగున ఆయన శిరస్సునుండి రక్త ప్రవాహము స్రవించినది.

విశ్వాసికి ఆ శిరో రక్తమువలన మంచి తలంపులు, మంచి చూపు, మంచి వినికిడి, మంచి మాటలు వచ్చును. ఎందుకంటే ఆయనకు అది శ్రమ కలిగించే రక్తముగాని మనకు శుద్ధిచేసి, శాంతిని కలిగించే రక్తము. కాబట్టి ఇప్పుడు మనము ధ్యానించవలసినది ఏమనగా రక్తము కార్చిన తండ్రీ! మా తలంపులను, చూపును, మాటను, వినికిడిని, శుద్ధిచేయుము. నీకు వందనములు. అట్లు తలంచి మనము వందనములు చేయుట తండ్రికి చాలా ఇష్టము. ఇప్పుడు ఈ శిరో రక్తధార గురించి విన్నారు. గనుక కొన్ని నిమిషములు ధ్యానించుకొందము. కండ్లు మూసికొని శిరస్సు మీద నున్న కిరీటమును తలంచుకొని నా వినికిడి, తలంపు, చూపు, మాటను మార్చుటకు రక్తము చిందించిన యేసుప్రభువా! నీకు స్తోత్రము అని ధ్యానించండి. అట్టి ధ్యానమువల్ల సంతోషము రావలెనుగాని, దుఃఖము రావలదు. సిలువవైపు చూస్తు శిరో రక్తధారవైపు చూస్తు, ధ్యానించండి, స్తుతించండి.

**పాట: మనసా యేసు మరణబాధ॥ 4వ చరణం**
**ముండ్లతోడ నొక కిరీటమల్లి ॥మనసా॥**

# శిరో రక్తధార - హస్త రక్తధార

యోహా. 3:14-15. సిలువధ్యానపరులైన వారలారా మీకు శ్రమకాదుగాని దీవెన కలుగుగాక, క్షేమము కలుగుగాక. మంచి శుక్రవారమునకు 'మంచి' అను పేరు వచ్చినది. అది అసలే మంచి శుక్రవారముకాదుగానీ ప్రభువుయొక్క సిలువనుబట్టి ఆ పేరు వచ్చినది. అయితే ఆయన సిలువలోనుండి ఆయనకు శ్రమయేగాని మనకు మంచియే వచ్చినది. గత బుధవారము శిరో రక్తధార గూర్చి కొద్దిగా వివరించితిని. ఈవేళ హస్త రక్తధారను గూర్చి ధ్యానించుకొందము. శిరస్సునకు, హస్తములకు సంబంధమున్నది. అట్లే శిరస్సునకును, పాదములకును సంబంధమున్నది.

**శిరస్సు:-** చెడ్డ తలంపులు శిరస్సులో పుట్టును. శిరస్సునందు కలిగిన తలంపులను నెరవేర్చుటకై చేతులు పనిముట్లుగా ఉన్నవి. ఉదా:- శిరస్సులో కోపము వచ్చినయెడల వెంటనే చేతులతో ఒకరిని కొట్టుదురు. శిరస్సులో అసూయ కలిగిన యెడల చేతులు ఒకరిని కొట్టును. శిరస్సులో పగలున్నయెడల చేతులు ఒకరిని కొట్టును. చేతులు కొట్టునేగాని ఆ చేతులు కొట్టుటకు శిరస్సుకు సంబంధము కలుగును. ఒక్కొక్కప్పుడు రెండు చేతులతో కొట్టుదుము, లేక చేతులతో త్రోసివేతుము. తుపాకి వాడునప్పుడు రెండు చేతులు వాడుదురు. కత్తి వాడునప్పుడు అట్లే. కాబట్టి మానవుడు పాప విషయములో రెండు చేతులు వాడుచున్నాడు. శిరస్సుయొక్క పాపపు తలంపులు నెరవేర్చుటకై చేతులు ఉపయోగింతురు.

**ఒక కథ:-** అమెరికాలో ఒక ఉపాధ్యాయుడు బాలురకు అసూయను గూర్చి నేర్పుటకు ఒక దృష్టాంతమును చూపెను. ఇద్దరు పిల్లలను ఒకచోటే కూర్చుండబెట్టి ఒక పిల్ల చేతులో పెద్ద

రొట్టె, రెండవ పిల్ల చేతిలో చిన్నరొట్టె పెట్టగా చిన్న రొట్టె కలిగిన పిల్ల పెద్ద రొట్టెగల పిల్లయొద్ద లాగుకొనెను. ఈ ప్రకారము తలయొక్క కోర్కెలు నెరవేర్చుటకై రెండు చేతులు ఉపయోగించుచున్నాము. కాబట్టి యేసుప్రభువుయొక్క రెండు చేతులలో మేకులు కొట్టిరిగాని అవి మానవులమైన మన పాపపు చేతులలో కొట్టవలసినది. ప్రభువు మనకు బదిలీగా వచ్చినారు గనుక మనశిక్షను ఆయన పొందెను.

క్రిందటి బుధవారము శిరస్సుయొక్క దోషములను వివరించితిని. ప్రభువు శిరస్సుమీద పొందిన ఆ శిక్షను మనము పొందవలసినది. కాని ఆయనే పొందెను. అలాగుననే చేతులలోకూడా ఆయనే పొందెను. ఈ రెండు అవయవములలో మన నిమిత్తమై ఆయన శ్రమ పొందెను. గనుక ఈ కాలములో మనము అది తలంచుకొని వందనములర్పించవలెను. *శిరస్సునుండి కారు రక్తము దేహము, కాళ్ళు, చేతులకు ప్రవహించును. అట్లే శిరస్సు, శిరస్సులోపుట్టిన చెడ్డ తలంపులు శరీరమంతటికి వ్యాపించును.* ఆ సంగతి మన ఇతర అవయవములు చేయుచున్న దుష్కార్యములనుబట్టి తెలియవచ్చును. చేతులతో మరియొక పని; చేయుచున్నాము. ఇతరులకు చెడ్డ ఉత్తరాలు వ్రాయుచున్నాము. చేతులదేకాదు ఆ పని శిరస్సు పనికూడాయై ఉన్నది. చేతులతో ఇంకొక దుష్కార్యము చేయుచున్నాము. ఇతరులకు, బీదలకు చేయవలసిన ధర్మము చేయక బిగపట్టుచున్నాము. అది ఒక దోషము. అదియు శిరస్సుయొక్క దోషమే. మానవులు ఇతరుల ఆస్తివైపు చేతులుచాపి దొంగతనములు చేయుచున్నారు. ఇది మరియొక దోషమే. ఈ ప్రకారముగా మన చేతులద్వారా జరుగుచున్న దోషమంతటికి ఆయన చేతులలో శిక్ష పొందెను. గనుక ఆయనకు వందనములు ఆచరింపవలయును.

శిరస్సులోని రక్తము ఇతర అవయవములన్నిటికి శరీరముయొక్క చివరివరకు వ్యాపించుచున్నట్లు మనిషియొక్క జీవితాంతమువరకు ఈ చెడుకూడా వ్యాపించుచున్నది. ఆ గొప్ప శిక్షను ప్రభువు అనుభవించినాడు గనుక ఆయనకు స్తోత్రములు చెల్లించుటకై ఈ శ్రమకాల ధ్యాన దినములు ఏర్పాటు చేయబడినవి. మొదట స్తుతించుటకుకాదుగానీ ***నా పాపముల నిమిత్తమై శ్రమపొందినావని పాపములు ఒప్పుకొని ఆ తరువాత స్తుతించవలెను. పాపములు లోపటపెట్టి స్తుతిచేసినందువల్ల దేవుని నామమును వ్యర్థముగా ఉచ్ఛరించుట అనుగొప్ప నేరమగును.*** గాన తల, చేతులద్వారా చేసిన పాపములను ఒప్పుకొని, రెండు ఒప్పుదలలో రెండు స్తుతులు చేయవలెను. చేతులలో ఆయన మేకులు పొందినట్లు ఒక కీర్తన ఉన్నది. 22వ కీర్తన 16 వ వచనము.

**ప్రార్థన:-** యేసుప్రభువా! నీ శిరస్సులో మేకులు దిగగొట్టినప్పుడు నీ మనుష్య శరీరమునకు ఎంతబాధ! ఆ మేకులు మా తలలోనే గ్రుచ్చుకొంటే ఎంత బాధో మాకు తెలుస్తున్నది. **అయితే ప్రభువా! మా తలలో పాపపు తలంపులు పుట్టినప్పుడు మేకుల వలన కలిగిన బాధకంటే ఎక్కువ బాధ మాకు ఉండవలసినది.** అప్పుడు ఆ పాపపు తలంపు ఉండదు. మాలో చెడ్డ తలంపులు కలిగినప్పుడెల్లా అట్టి బాధ మాకు కలిగిస్తే మాకెంతో మేలు. అట్లే మా చేతులు, తలయొక్క తలంపులు నెరవేర్చినప్పుడు అట్లే బాధ కలిగి ఉండవలెను. అట్టి బాధ మాకు అవసరము. శరీరమునకు కలిగే బాధకంటే మనసునకు కలిగే బాధ అవసరము. కాబట్టి ప్రభువా! నీ సిలువధ్యానము బాగుగా చేసేటట్లు ప్రేరేపణ కలిగించుము. అంతరార్థములతో ధ్యానము చేసేటట్లు ప్రేరేపించుము. ఈ మనవులు పరలోకపు తండ్రిని మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము. ఆమేన్.

# పాద రక్తధార

## కీర్తన 22:1-3; లూకా. 23:27; 1తిమో. 3:2.

బరువు, భారము ప్రయాసపడి మోసికొనుచున్న వారలారా! నాయొద్దకు రండని యేసుప్రభువు చెప్పెను. ఆయనే లోక భారములను మోసికొనుచున్నారు. ఆయనే భారమును మోస్తూ, భారములను మోయుచున్నవారికేమి సహాయము చేయగలడు? గాని భారము మోయువారికి సహాయము చేసెను. అప్పటినుండి సహాయము చేస్తూనేయున్నారు. ఇక్కడ లోకములో ఉన్నవారికి ఎంత భారము! ఏ విషయములో భారము ఉన్నను అది ఆయన తీసివేయగలడు. ఇది మంచి వర్తమానము. బజారులోనుండి ఒకరు బియ్యము బస్తా ఎత్తుకొని వస్తు ఉంటే, మధ్యలో ఎవరైనా ఎత్తుకొని దించిన ఆయనకు ఎంత హాయిగా ఉండును! అలాగే మానవులకు ఏ భారమైనా, ఎన్నాళ్ళ భారమైనా, ఏ రకమైన భారమైనను, మనస్సు శరీర బాధలైనా అన్నీ ఆయన తీసివేయగలడు. ఎందుకంటే ఆయన ఆ భారములను మోయగలడు, మోసివేసినాడు గనుక తీసివేయగలడు. పోయిన వారములలో శిరో, రక్తధారలను గూర్చి చెప్పినాను. ఆ శిరస్సు ముండ్ల కిరీట భారము మోసెను. మరొక వారము హస్త రక్తధారను గూర్చి చెప్పినాను.

నేడు పాద రక్తధారను ధ్యానించెదము.

**పాద రక్తధార:**– పాదరక్తధారను గూర్చికూడ శిరస్సునకు ఒక పని ఉన్నది. చేతులకు ఒక పని ఉన్నట్లు పాదములకు ఇంకొక పని ఉన్నది. పాదములకు ఉన్న పనులలో ఏ పని

ముఖ్యమైన పనో ఆ పనిని తలంచవలెను. మహాముఖ్యమైన పని పాదములకు ఉన్నది. అనగా మన పాదములకు ఉన్న ముఖ్యమైన పని తెలియని వారుండరు. అది ఏది అని అడిగితే, నడవడమే అని అందురు.

పాదములకు ఉన్న పని నడవడమేగాని పాదములయొక్క పని అంతటిలో మహా ముఖ్యమైనదియు, మనము విచారింపవలసిన పనియు ఏది? ఆటలలో చిన్నపిల్లవాడు, పెద్దవానిపైన నిలువబడగా ఒకరిపై ఒకరు నలుగురు నిలువబడినప్పుడు ఎవరికి ఎక్కువ భారము మొదటి వానికే గదా! నేలపై అడుగువేయునప్పుడు, మొదటిగా నేలను తాకునది అరికాలు గాన అరికాలు శరీరమంతటిని మోయుచున్నది. దానికే ఎక్కువ భారము. తక్కిన శరీరమునకు భారమే గాని ఎక్కువ భారము అరికాలుకున్నది. అది మన చరిత్ర. అరికాలికే కాదు. మీ కాళ్ళకుకూడా బరువే. మీ కాళ్ళు శరీరమంతటి భారమును మోస్తున్నవి. యేసుప్రభువుయొక్క కాళ్ళకు మేకులు కొట్టినప్పుడు యేసుప్రభువు లోకభారమంతా మోస్తున్నారు. ఆయనకాళ్లు, దేహ భారమంతా మోస్తున్నవి రెండు సంతోషమే. చేతులు కొంతవరకు సహాయముగాని ముఖ్యభారము కాళ్లకే. పాదములతో చేయుచున్న దుష్టకార్యములున్నందున యేసుప్రభువు మన పాపములకు బదులుగా శిక్ష అనుభవించెను. అది ఎంత కష్టమో మనకు తెలియదు. శరీరమంతటి, భారమును కాళ్లు మోస్తున్నవి. ప్రభువు శరీరమంతటిని, లోకభారమంతటిని ఆయన పాదములే మోస్తున్నావి. నీ పాపములను ఆయనే మోస్తున్నాడు. నా కాడి సుళువని యేసుప్రభువు చెప్పెను. అయితే మన పాప కాడి బరువుగానే యున్నది. మన కాడి మనకు బరుగానే యున్నది గాని అది ఇదివరకే యేసుప్రభువు మోసిరిగాన

'ఉంటేఉన్నది గాని' తేలిక అయినది. కాళ్లతో చేసిన పాపములు మానవులలో ఉన్నవి.

ఒకరి ఇంటిలో దొంగతనము చేయుటకు పాదాలు తీసికొని వెళ్లకపోతే మనిషి వెళ్లగలడా? గనుక ఆ మనిషిని తీసికొని వెళ్లినది పాదములే.

2. మత్తు పదార్థములయొద్దకు ఈ పాదములే, సొమ్ము ఉన్నను లేకపోయినను; ఇష్టమున్నను లేకపోయినను తీసికొని పోవును.

3. కలహ స్థలమునకు మనిషిని పాదాలే తీసికొని వెళ్లుచున్నవి. గనుక పాదములతో మనిషిచేసే నేరములున్నవి. సామెతె కలదు అతగాడు **'కలహానికి, కయ్యానికి కాలు దువ్వుననేది'** కలదు. దానినిబట్టి పాదముల పాపము బైటపడుచున్నది గనుక ఎవరైనా ఎప్పుడైనా వారి పాదములతో పాపముచేసినా ప్రభువు దగ్గర పశ్చాత్తాపము పడిన ఆయనకు సంతోషము లేని యెడల విచారము.

ఒకరి పాదములు ఒకరి భారము మోయవలసిన దానికి బదులు ఇంకొకరికి భారము కలిగించుచున్నవి. ఎవరికైనా కోపము వచ్చినప్పుడు కర్రలేక, కాలితోనే తన్నివేస్తారు. అట్టి వారు ఎప్పుడు ఉంటారు. అయితే పాదముల పాపములు ఇంకా ఉన్నవి గాని ఇంతవరకు చాలును.

యేసుప్రభువు మన పాదముల పాపములు పరిహరించు నిమిత్తము సీలలు కొట్టించుకొని పరిహరించెను. ఆయన పాదములతో రక్తము చిందించెనని నమ్మితే మన పాదముల

పాపములకు పరిహారము కలుగుచున్నది. ఇట్టి గొప్ప ఉపకారము కలుగజేసిన ఆయన పాదములతో ఎవరిని తన్నలేదు. పాదములతో కొట్టువారు తక్కువమంది. చేతులతో కొట్టువారు ఎక్కువ. బూతులతో కొట్టువారు మరీ ఎక్కువమంది.

*మనము శిరస్సుతో, హస్తములతో పాదములతో ప్రభువును స్తుతించేవారముగా ఉండవలెను. గాని పాపములు చేసే వారముగా ఉండకూడదు.*

**ఇప్పుడాయన లోక శరీర పాదములకు మనకున్న రక్తము లేదు గాని పాదములలో మహిమ రక్తమున్నది. అది శ్రమలవల్ల ప్రవహించేదిగాదు గాని రక్షించే విశ్వాసుల పాదములమీద ప్రవహించేదైయున్నది.**

ప్రక. 1వ అధ్యాయములో యోహాను గారికి రక్త సిక్త పాదాలు కాదుగాని అపరంజి పాదములు, మహిమ శరీరము కనిపించెను. అట్టి దర్శనమందుకొనుట కొరకు మనము శిలువమీద తన మానవ పాదములకు ఆయన కొట్టించుకొన్న సీలలను తలంచి ధ్యానించుకొందము. పాట: నాయన్నా సిలువలోనీ వాయాసపడిననాటి-నీ యంఘ్రీయుగము (పాదములు) నిపుడు-నా యాశదీరజూతు ॥నాయన్న రాగదే॥

# గర్భాలయము

**దా॥కీర్తనలు 103:1; మత్తయి. 28:16-20; 1కొరింథి. 11:23-31.**

యేసుప్రభువా! నీవు నీ సంఘమునకు భూలోకములో అనుగ్రహించిన గొప్ప విందు వర్తమానము ఇప్పుడును అనుగ్రహించుమని వేడుకొనుచు వందనములు చెప్పుచున్నాను. ఆమేన్.

లోకములో ఎవరైనా పుట్టుట ఒక్కసారే. మనమును అనేకసార్లు పుట్టము. కాని భోజనము చేయుట అనేకసార్లు. బాప్తిస్మము పుట్టుకతో సమానము. శరీర రక్తములు తీసికొనుట భోజనముతో సమానము. అన్యులు, బాప్తిస్మము ద్వారా పుట్టి, క్రైస్తవులుగా మార్చబడుచున్నారు. **ముసలివాడైన నీకొదేము తల్లిగర్భములో తిరిగిపుట్టితే మనముకూడా తిరిగి బాప్తిస్మము రెండవ సారి పొందవచ్చును.**

బిడ్డ పుట్టకముందు తల్లిలోని ఆహారము, రక్తము, ఊపిరి, గుణములు, ప్రాణము అందుకొంటున్నది. తల్లిలోని రక్తము, గుణము, రూపము, శరీరము అందుకొంటున్నది. తల్లికి ప్రసవము రాగనే బిడ్డను శుభ్రముచేసి పరుండబెట్టి; అచ్చుట తల్లి, తండ్రి రూపముతోనే బిడ్డ ఉన్నదని చెప్పుకొందురు. ఆలాగే ప్రభువు భోజనములో రొట్టె, శరీరము, ద్రాక్షారసము, రక్తము ఈ రెండు అందుకొన్నప్పుడు ఆయన గుణాలు, పరిశుద్ధత, మంచితనము, దైవత్వము అందుకొంటాము. తల్లిగర్భములోనే బిడ్డ అందుకొన్నట్లు మనమును ఇక్కడను అందుకొంటున్నాము. బిడ్డ ఎదుగునప్పుడు తల్లి అంత పొడవుగా ఎదుగుచున్నది. మనమును ప్రభువువలెనే ఎదగవలెను.

శరీర రక్తములు అందుకొన్నట్లు మనకు తెలియదు. గర్భములోని బిడ్డ ఆహారము అందుకొన్నట్లు ఆలాగే రొట్టె, ద్రాక్షారసముతో ఇవి కూడా అందుకొంటున్నాము. గర్భములో అందుకొన్నట్లు బిడ్డకు తెలియకపోయినా అందుకొన్నది. తెలియడము వేరు, అందుకొనడము వేరు. **అట్లే తెలియకపోయినా సంస్కార విందులో శరీరము, రొట్టె అందుకొంటున్నాము. రక్తము, ద్రాక్షారసము అందుకొంటున్నాము.** బిడ్డ తల్లినే అందుకొన్నది. మనము ప్రభువునే విందులో అందుకొంటున్నాము. ఏనాడో అదృష్టము చేసికొన్నందువలన మనకు ఆయన శరీర రక్తములు దొరుకుచున్నవి. గనుక వద్దనకూడదు. ప్రభువు వడ్డించువాడు. ఇది బియ్యముతో భోజనము తయారుచేసి, వడ్డించులాంటిది కాదు. ఇది ప్రభువు అన్నీ తనలోనున్నవే తీసి తానే వడ్డించియున్నాడు. భోజనశాలనుండిగాని హోటల్‌నుండిగాని తెచ్చినదికాదు. వంటగది భోజనము, ఇంటిలోని భోజనముకాదు. దేవాలయములో ప్రభువే తానే ఇచ్చే భోజనము.

పాదిరిగారు ఇచ్చేది రొట్టె, ద్రాక్షారసముకాదుగాని దానితో ప్రభువు శరీరము, రక్తము ఇస్తున్నారు. కనబడే రొట్టె, ద్రాక్షరసమును మొదటిసారిగా ప్రభువు ఇచ్చేటప్పుడు; శిష్యులకు ఇవి కనబడని తన శరీర రక్తములు అని ఉచ్ఛరించెను. శిష్యులేమనుకున్నారో తెలియదు. తాను వచ్చు పర్యంతము భోధకులను ఈ క్రమమునే ఆచరించుమనెను. బిడ్డ తొమ్మిది నెలలు గర్భములోనున్నపుడును, ఆ పిదప జన్మించిన తరువాతను తల్లే కావలెనను. అన్నములో పడినా, తల్లే తినిపించెను. అట్లే ప్రభువును తననే ఆహారముగా తినిపించెను. గురువారము 11మంది శిష్యులకు ప్రభువు తన్ను తినిపించెను. భోధ ఏమి

చేయలేదు. అన్యులు, సంస్కారమునుగూర్చి 'ఆయనను ఏలాగు తిన్నారు'? అది వట్టిమాట అని అన్నట్లయితే, మనము వారితో నీవు ఏలాగు తల్లి గర్భములో ఉండి, తల్లి రక్తము త్రాగినావని అనవలెను. "ప్రయాసపడి భారము... నాయొద్దకు రండి" విందు చేయించిన రాజుగారు అంతా సిద్ధముగా ఉన్నది సందులలో, గొందులలో ఉన్నవారలారా! రండి! అని పిలిచెను. అట్లే ప్రభువు సమస్తము సిద్ధముగా ఉన్నది. నేను మీలోనికి రావడానికి సిద్ధముగా ఉన్నాను. రండి, అని సంస్కార విందులో పిలుచు చున్నారు.

అలాగే తల్లి బిడ్డలోనికి రావడానికి సిద్ధమైననూ, బిడ్డ ఆహారము తింటున్ననూ కొన్నిమార్లు చిక్కిపోతుండును. వెంటనే వైద్యునికి చెప్పి ఏదో ఇవ్వాలి. ఆలాగే సంస్కారము పుచ్చుకొన్న మనము చిక్కకూడదుగాని మనుష్యులముగాన చిక్కిపోతాము. గనుక మరలా మరలా పుచ్చుకొనవలెను. ఈ చిన్న వర్తమానము 'చిన్నరొట్టె, కొంచెఎము ద్రాక్షారసము' వలె పుచ్చుకొని అనుభవించి బలముపొందండి. ప్రభువు మిమ్ములను వాక్యము, శరీరము, రక్తములద్వారా దీవించి బలపరచునుగాక! ఆమేన్.

# పరలోక నిచ్చెన

**దా.కీర్తన. 39; మార్కు. 16:16; గలతీ. 1:1.**

పై అంతస్తుకు చేరుటకు ఆశించిన ప్రియ విశ్వాసులారా! ఆదినుండి నేటివరకు, మనము జన్మించిన దినమున ఉన్న పసి పిల్లలముగానే లేము. కాబట్టి శరీర విషయములో ఏరీతిగా ఎదుగు చున్నామో ఆ రీతిగా జ్ఞానములోకూడా ఎదుగవలెను. అవును చిన్నప్పుడు ఉన్న తెలివితేటలకంటె పెద్దయినప్పుడు తెలివి ఇంకా ఎక్కువగానే ఉన్నది. కాబట్టి జ్ఞాన విషయములో ఎదుగుచున్నాము. ఇందాక చెప్పినట్లు శరీర విషయములో ఎదుగుచూనేయున్నాము. ఈరెండును మనుష్య జీవితమునకు ముఖ్యము. అయితే ఈ రెండు లోకానికే. శరీరము ఇక్కడే ఉండిపోవుచున్నది.

మనకు జ్ఞానమున్నది. అందుచేత మనము అన్నవస్త్రాదులను సంపాదించుచున్నాము. పొలములో, పాఠశాలలో, ఆఫీసులో ఉద్యోగము చేసికొనుచున్నాము. కాని ఇవి పరలోకములో లేవు. ఈ లోకములో జీవించినంత కాలము మనము జీవించి పరలోకమునకు వెళ్లాలి. భూలోకములో రెండు గొప్ప అంతస్థులున్నవి. 1. శరీరములో, 2. తెలివితేటలలో ఎదుగుట. ఈరెండు గొప్ప అంతస్తులే. ఈ రెండింటికంటె పరలోకములోనికెళ్లుట గొప్ప అంతస్థు. **ఈ రెండు ఇక్కడ అభ్యాసము చేసికొంటే పరలోకము వెళ్లుట సులువు.** అయితే ఈ శరీరము ఇక్కడే విడిచిపెడతాము. అన్నము, బట్టలు, విద్య, ఉద్యోగము కావలెనని ఆశించే ఈ జ్ఞానమునుకూడా ఇక్కడే విడిచిపెడతాము. ఇవన్నీ పరలోకములో లేవు. శరీరముకంటె, జ్ఞానముకంటె గొప్పవి పరలోకములో ఉన్నవి. అవి ఆశించుట గొప్పకాదా! కాబట్టి మనదృష్టి ఇక్కడ ఉన్నప్పటికిని, ఇవి

అవసరమేగాని మనదృష్టి పరలోకమువైపు ఉండడము మరీ అవసరము. 1. ఆ పరలోక విషయములు 2. ఆ పై అంతస్తు విషయములు తెలిసికొనుటకు ఇట్టి దేవాలయమే ముఖ్యమైన స్థలము. అందుచేతనే ప్రతి ఆదివారము దేవాలయానికి వచ్చి బోధ వింటున్నాము.

ఈ గుడిలో 1. ఇక్కడే ఉండిపోదాము, 2. ఇక్కడే జీవిస్తాము అనే బోధ ఉండదుగాని; ఇక్కడ ఉండి పరలోకమునకు సిద్ధపర్చునట్టి బోధ మాత్రమే దేవాలయములో ఉండును. దేవుడు మనకు అనుగ్రహించిన వరములలో ఒకటి దేవాలయము. క్రైస్తవ పాఠశాలలోను ఈ బోధ ఉంటుంది. కుటుంబ ప్రార్థనలోను, ఉజ్జీవ కూటములోను ఈ బోధ ఉండును. 1. కుటుంబములలో 2. పాఠశాలలో (వేదాంత పాఠశాలలో) 3. ఉజ్జీవ కూటాలలో 4. దేవాలయములలోని బోధ ఇవన్నీ ఒకటే వరుస. ఇవన్నీ మనలను భూలోకములో ఉండకుండ పరలోకమునకు తీసికొని వెళ్లుటకు సాధనములైయున్నవి. **కాబట్టి వీటిలో ఏది వదలిపెట్టినా మనకు పై అంతస్తురాదు.** ఈ నాలుగు ఒకదానిలోనే, ఒక వరుసలోనే ఉన్నవిగాని ఈ నాలుగు కలిసి మరలా ఒక్కదానిలోనే ఉన్నవి. రంధ్రము ఒక చిటకిన వ్రేలంత రంధ్రము పడవకు ఉన్నట్టే ఇవి అన్నికూడ ఒక్క దానిలోనే ఉన్నవి. ఈ నాలుగు అనగా 1. కుటుంబ ప్రార్థన 2. పాఠశాలలో 3. ఉజ్జీవ కూటములలో 4. దేవాలయములలో పై నాలుగు కలిసి ఒకదానిలోనే ఉండేది ఏమిటి? ఏకాంత ప్రార్థన (దైవసన్నిధి) ఒక్కొక్కరు చేసికొనేది. అప్పుడు అన్నీ కలిసి 5 అయినవి. అవి ఏమిటనగా క్రైస్తవ మత సంఘములోనే ఈ 5 అనుభవములు కలిసి ఉండును.

కాబట్టి ఈ మత సంఘములోనికి, ఈ 5 అంతస్థులు ఉన్న మతములోనికి వచ్చే క్రొత్తవారు వీటినిబట్టి, ముఖ్యముగా పై నాలుగు కలిసి ఉన్న ఐదవదైన, దైవసన్నిధి ప్రార్ధనునుబట్టి బహుగా ఆనందింపవలెను. ఈ క్రైస్తవ మతసంఘమనే పడవ పరలోకానికి తీసికొని వెళ్లేది. ఈ పడవకు రంధ్రములులేవు. పడవ ఎక్కుట సులువేగాని మనుష్యుల ఏర్పాటులలో బేధములు ఉన్నవి. ఈ క్రైస్తవ సంఘ పడవకు రంధ్రములు ఎందుకు లేవు అంటే దీనిని దేవుడే నరావతారమెత్తి స్థాపించినందున దేవునికి రంధ్రాలు లేనట్లు సంఘానికి రంధ్రాలులేవు. బహు పూర్వకాలమందు మనుష్యులలో విస్తారమైన పాపము జరుగుటచూచి దేవుడు సహించలేకపోయినాడు. ఆ పాపమున్న జనాంగాన్ని ఇంకా ఉంచితే తరువాత వచ్చే జనాంగానికి ఆ పాపము అంటుకొని, పాపము ఇంకా పెరుగుచున్నది. కాబట్టి వారిని ఈ భూమిమీద లేకుండ చేయుటకై ఆకాశములో గొప్ప వర్షము ఒకటి ఏర్పడినది. వీరి పాపమునుబట్టే ఆ విస్తార వర్షము ఏర్పడినది.

ఈ వర్షము పొలములు పండించుటకుకాదు, చెట్లు పెరుగుటకుకాదు, నదులు నిండుటకుకాదు, దాహశాంతి నిమిత్తము త్రాగటానికి ఏర్పడలేదు. కాని ఈ పాపాత్ములను ముంచి నాశనము చేయుటకే ఏర్పడినది. అప్పుడు దేవుడు, నోవహు అనే ఒక తాతగారిద్వారా ఆ ఓడకట్టే ఏర్పాటు గావించి, 'నోవహు! నీవు ఓడ కట్టుము. కొన్నాళ్లకు ఆకాశమునుండి ప్రచండ వర్షము బహు రౌద్రముతో రానైయున్నది. నీవు 1. ఓడకట్టుము, 2. వర్షము రాబోవుచున్నది 3. అది మిమ్మును ముంచివేయును. 4. ముందుగానే మీరు దీనిలోనికి వస్తే బ్రతుకుతారు అని చెప్పగా; 1) ఆకాశములో మేఘములులేవు 2) ఇవన్ని పిచ్చిమాటలు అని

ఎవరు నమ్మలేదు. దేవుడు:- 1. నమ్మేటందుకు 2. గ్రహించేటందుకు 3. సిద్ధపడేటందుకు 120 సంIIలు గడువు ఇచ్చెను. గనుక వారికి ఈ మూడు గడువులు అవసరమే. వారు గ్రహించేటందుకు తాతగారు బోధచేసెను. ఆ బోధే వారు గ్రహించే సమయము. ఆ గ్రహించిన పిదప ఆలోచించి, నమ్మాలి. ఆలోచిస్తేనేగాని ఎవ్వరూ నమ్మరు. గనుక ఆలోచన తరుణము.

***1. బోధ వినే తరుణము 2. విన్నది ఆలోచించేటందుకు తరుణము 3. సిద్ధపడి ప్రవేశించుటకు తరుణము.*** ఈ మూడు దేవుడు ఆ పాపాత్ములకు అనుగ్రహించినట్లు మనకును ఆ మూడు అనుగ్రహించుచున్నాడు.

ఓడలో ప్రవేశించుటకును తరుణమున్నది. ఇందాక చెప్పినట్లు, ఈ లోకములో క్రైస్తవమత సంఘమనే ఓడ ఉన్నది. ఈ ఓడలోనికి ఈ దినము కొందరు చేరుటకు వచ్చిరి గాన సంతోషము. ఇదివరకు వినిన వారు, బోధ ఆలోచించి ప్రభువును నమ్మినారు. గనుక బాప్తిస్మము పొందవచ్చిరి. ఆ బాప్తిస్మము ద్వారా బయటనుండి క్రైస్తవమత సంఘ ఓడలోనికి వచ్చుటకు ప్రవేశము దొరకుచున్నది. ఆ ఓడ ఈ లోకములోనుండి బయలుదేరి, దేవుని సింహాసనము దగ్గరకు, పరిశుద్ధులు, దేవదూతలు, మహిమ స్థానమున్న పరలోకమనే దరికి వెళ్ళుచున్నది. ఈ లోకములో మానవ జీవితానికి ఉన్న అవసరాలు లేని స్థలానికి వెళ్ళుచున్నది. అక్కడ అన్నము, బట్టలు, కూరలు, ధాన్యము, తిను బండారములు అనే అక్కరలు లేని స్థలమును వెళ్ళుచున్నది. ఈ అక్కరలు కాదుగాని అన్నీ అక్కరలు తీర్చే స్థలానికి ఈలోక కష్టాలు లేని స్థలానికి, వెళ్ళుచున్నది.

1. కుటుంబ చిక్కులు, 2. జబ్బులు, 3. ఇబ్బందులు, 4. చావు; ఇవేవి ఉండని స్థలానికి వెళ్ళుచున్నది. గనుక నేడు

ఈ సంఘనావలో ప్రవేశించేవారికి పైన చెప్పిన నాలుగు ఉండవు గానీ 1) వెలుగు 2) సంతోషము 3) సుఖము, 4) దేవుని ముఖకాంతి 5) అనంతకాలము దేవుని సింహాసనము ఉండును. గాన అది అనుభవించే నిమిత్తమై ఈ ఓడలో చేరువారు ధన్యులు, అదృష్టవంతులు.

నేడు బాప్తిస్మము పొందువారికి గొప్ప పండుగ. అనగా ఓడ ఎక్కేవారికి పండుగే, అదివరకు ఓడలో ఉన్నవారికి వీరు ఓడ ఎక్కుచున్నందుకు పండుగే. క్రైస్తవ సంఘ నావలోనికి నోవహు దినములలోవలె రానివారుంటారు. 120 సంవత్సరములు కష్టపడి, నావకడితే 1) మృగములు, 2) పక్షులు, 3) ఆ ఎనమండుగురు వెళ్ళిరిగాని అవిశ్వాసులు ఓడలోనికి రాక వర్షములో తడుస్తూ ఇంటికప్పు ఎక్కిరి. వర్షము వారిని తరిమెను. చెట్లెక్కిరి, అక్కడకూడ వర్షము తరిమెను; కొండలు ఎక్కిరి. అది వారిని ముంచివేయుటకే వచ్చిన వర్షముగాన అచ్చటకూడ ముంచివేసినది. ఓడ ఎక్కుదామని తలంపు వచ్చినా తలుపులు వేయబడెను గాన లాభమేమి! ఎక్కుదామన్నా మునిగిచస్తారు. 1. రమ్మని 2. ఓడెక్కమని; (1) దేవుడు చెప్పిరి (2) తాతగారు చెప్పిరి (3) వరదా చెప్పినది, (4) ఓడలో ఉన్న సృష్టంతా చెప్పినది (5) ఎనమండుగురు చెప్పిరి (6) పక్షులు చెప్పినవి (7) ఈ గొప్ప వర్షము చెప్పినా లెక్కలేదు, నశించిపోయిరి. నేటి దినములలోను అలాగే బోధకులు- పాటలు, వీధి ప్రసంగములు, పత్రికలు, చెప్పినా ప్రజలు వినరు. ఎలాగో ఈవేళ కొందరు ఆ వార్త విని వచ్చినారు. వారికి దీవెన కలుగునుగాక! దేవుడు వారిని ఆశీర్వదించి సిద్ధపరచునుగాక! స్థిరపరుచునుగాక! ఆమేన్.

# రక్షణాహ్వాన పాఠము-1

బైబిలులోని 4 చిన్న గ్రంథములు : మత్తయి, మార్కు, లూకా, యోహాను. ఈ 4 చిన్న పుస్తకములకు కొన్ని భాగములు గలవు. ప్రభువుయొక్క జన్మ, ఉద్యోగ, మరణ, పునరుత్థాన భాగములు గలవు.

యేసుప్రభువుయొక్క ఉద్యోగ ధర్మము. యేసుప్రభువు యొక్క ఉద్యోగము నాకంటికి ఏరీతిగా కనబడుచున్నదో, అది చెప్పెదను. మనము కూర్చున్న పర్ణశాలకు ఎదురుగానున్న రాజవీధిలో యేసుప్రభువు ఉద్యోగ వస్త్రములు ధరించుకొని నిలువబడియున్నారు. మరియు ఆయనే మన పర్ణశాల ద్వారముయొద్ద నిలువబడియున్నారు. పర్ణశాల ముఖద్వారమున ఆయన కూర్చునియున్నారు. పర్ణశాల వెనుకకూడా ఆయన కూర్చునియున్నారు. ఆకాశము, నక్షత్రములలోకము దాటిచూస్తే మహిమలోకములో సింహాసనముమీద కూర్చునియున్నారు.

1. రాజవీధిలో,
2. ద్వారముదగ్గర,
3. పర్ణశాల లోపల,
4. పర్ణశాల వెనుక,
5. మహిమ లోకములో. ఆ ఐదు స్థలములలో ఆయన ఉద్యోగ ధర్మము జరిగించుచున్నారు.

రాజవీధిలో ఒక వాక్యమున్నది. ఆహ్వానవాక్యము:

1. 'ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన వారలారా! నాయొద్దకు రండి'. మత్తయి 11:28.

2. ద్వారముదగ్గర ఒక వాక్యమున్నది- 'నాయొద్దకు వచ్చువానిని నేను ఎంతమాత్రమును బయటికి త్రోసివేయను". యోహాను 6:37.

3. పర్ణశాల లోపట- 'నాయొద్ద నేర్చుకొనుడి'. మత్తయి 11:29.

4. పర్ణశాల వెనుక- 'నా కాడి ఎత్తుకొనుడి'.మత్తయి 11:29.

5. మహిమ లోకములో – 'నేను మీయందున్నాను. మీరు నాయందు ఉండుడి.' యోహాను 14:20.

1) ఆయన రాజవీధిలో పిలుచువాక్యము కొందరికి వినబడవచ్చును. కొందరికి వినబడకపోవచ్చును. కొందరికి త్వరగా వినిపించును. అయిననూ, కొందరికి ఆలస్యముగా వినిపించును. ఆయన పిలుస్తూ ఉన్న సంగతి అందరికి వినబడవలెనని, ఆయన పిలుచుచునే ఉన్నాడు. ఎవరైనా వెనుకనుండి పిలిస్తే వెనుకకు చూడక మానరు. అట్లే ఆయన పిలుపు విన్నవారు ఆయనవైపు చూడకమానరు. ఆయన పిలుపు అంగీకరించక మానరు. సమస్తమైన వారంటే కొందరికి కాదు. అందరికినీ. అన్ని రాష్ట్రముల వారికొరకును. రాజమండ్రి పట్టణములోనేకాదు, ఒక్క ఇండియా దేశమునేకాదు, గుడిసెలలో, నగరములో, ఇండ్లలో అందరిని పిలుస్తున్నారు. ఏ ప్రకారముగా పిలుస్తున్నారు? అందరికి వినబడేటట్లు. కొందరికి ఆలస్యముగా, మరికొందరికి మరీఆలస్యముగా వినబడుచున్ననూ, అందరికి వినబడేటట్లుగానే పిలుస్తున్నారు. కొందరికే వినబడవలెనని ఆయన పిలువలేదు. అందరికి వినబడవలెనని ఆయన పిలుస్తున్నారు. పిలుపు ప్రకారము చేసిననూ, చేయకపోయిననూ, పిలుస్తున్నారు.

ఆయన పిలువక మానరు; ప్రజలు చూడకమానరు,
ఆయన మాట ప్రకారము చేయకమానరు.

జన సమూహముల ఎదుట నిలువబడి పిలిచినప్పుడు ఆయన ఎవరిని పిలస్తున్నారు అనగా సమస్తమైన వారలారా! సమస్తము అంటే కొందరుకాదు, ఒక తెగ కాదు, దేశముకాదు, జనాంగముకాదు, పిల్లలు, పెద్దలు, స్త్రీలు అందరు అని అర్ధము. ఏ మాత్రమును ఇష్టములేనివారినికూడ అని అర్ధము. ఏ దేశముగాని, గ్రామాదులుగాని 'ఆయన మమ్మును పిలువలేదు' అని పిర్యాదు చేయవీలుకాదు. ఈ పిలుపుయొక్క పరిమితి ఎంత గొప్పదో చూడండి. 5ఖండములను పిలిస్తే మహావిశాలమైన పరిమితిగల ఆహ్వానము! భూగోళమును చుట్టివేసికొని వస్తే ఇంకా ఎంత గొప్పదో! అంత గొప్ప పరిమితిగల ఆహ్వానమును అందరు వినవలెను. అందరు అంగీకరించవలసినదే. ప్రయాసపడి భారము మోసికొనువారు మాత్రమే గాదు, సమస్తమైన వారలారా! అని పిలుస్తూ ఉన్నారు. మాకెందుకు అని అనవలసిన ఆహ్వానముకాదు. అంగీకరించవలసినది. శాంతివర్తమానము, చేరదీసే వర్తమానము. ఆయన స్వరూపము ఏవిధముగా ఉన్నది! రెండు చేతులు చాచి 'నాయొద్దకు రండి' అని పిలుస్తూ ఉన్న గాయములు కనబడుచున్నవి. రెండుచేతులు విశాలముగాచాపి, పిలుస్తూ ఉన్నారు. భూగోళముయొక్క ఒకప్రక్కన ఒకచేయి, రెండవ ప్రక్కన మరొకచేయి చాపి పిలుస్తుఉన్నారు. ఎంతమంది వచ్చినా సరే చేర్చుకొనగలిగిన విశాల బాహుబలమునుబట్టి పిలుస్తూ ఉన్నారు. ఎటువంటి వారిని పిలుస్త ఉన్నారు? 'ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన వారలారా నాయొద్దకు రండి' అని భారభరితులైన అందరినీ పిలుస్తున్నారు.

ప్రయాసపడి భారమును మోయుట అంటే ఏమి? దృష్టాంతరము: భారమును భరించే ప్రభువు నాకు అక్కరలేదయ్యా! నేను మోసికొంటాను అనువారు లేరు. తెలియనప్పుడు అంటారుగాని తెలిసినప్పుడు ఆలాగు చేయరు. అన్ని భారములు దించివేయుట అను మాటలో విశేషములు రెండు కలవు. ఎక్కువ బరువైనది ఏది? రాయి, ఉక్కు, కొండ. కొండకంటే బరువైనది నక్షత్రాలు. పాపము ఇంకా బరువైనది. పాపము అన్నిటికంటే బరువైనది. అన్ని దుష్టశక్తులకంటె బరువైనది పాపము. ఈ భారము ఎవరు దించగలరు? సృష్టికర్త మాత్రమే దీనిని దించివేయగలరు. ఇది ప్రకటన వాక్యము. ***శుభవర్తమాన వాక్యము, భూగోళవాక్యము, యేసుక్రీస్తువాక్యము.*** ఇది చల్లని పఠనము. మానవులకు ఆదరణకరమైనది. గనుక అందరు అంతరంగముగా ఆయనయొద్దకు రావలెను.

కొందరికి శరీరములో 1. బాధ ఉన్నది. 2. మనోవేదన, చింతాక్రాంతులైనవారు ఇక్కడ లేరనుకున్నారా? పైకి చెప్పకపోయినా ఇక్కడ మనోవేదన గలవారున్నారు. గనుక వారు ప్రభువా! 1) నా ప్రియుడవు నీవే, 2) నా రక్షకుడవు నీవే, అని ప్రభువు యొద్దకు రావెలను. శరీర వ్యాధులనుబట్టి, కష్టములనుబట్టి ఇన్నాళ్లనుండి పోరాడుచున్నాను. ఈ పాపమును విసర్జించలేకపోవుచున్నాననే చింతగలవారు; చిక్కులను విడగొట్టలేకపోవుచున్నాను; వ్యాధులను పోగొట్టుకొనలేక పోవుచున్నాననే వారికి ఈ భారమునకు ఫలాని స్థలమునకు వెళ్లండి అని చెప్పలేదుగాని 'నాయొద్దకు రండి' అని చెప్పినారు. దగ్గరకు వచ్చి పిలుస్తున్నారు. ఎక్కడ పనిపాటులు చేసుకుంటున్నారో, అక్కడకు వెళ్ళి, రండని పిలుస్తూ ఉన్నారు. గనుక ఎంత గొప్ప దయగలతండ్రి! కొందరి దగ్గరికి వెళ్లలేమండి

అంటారు. గనుక ద్వంద్వార్థములుగల మాటలు చెప్పలేదు. స్పష్టముగానే చెప్పెను. *విచిత్రమైన సంగతి: ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన వారలారా! ఇంకొక చిన్నమాట– నాయొద్ద ఉంటే మీకు బాగుండునని వినువారికి చెప్పుచున్నారు. అందులో, వినండి అనేదిలేదు. ఎందుకంటే, ఆయన వినేటట్టు చెప్పితే వినకపోవడము లేనేలేదు. గనుక నాయొద్దకు రండి అని చెప్పినాడు.* ప్రయాసపడి అనేమాటలో ఈ సంగతి ఉన్నది సమస్తమైన వారలారా నాయొద్దకు రండి అనే హౌస్ అడ్రస్ (విలాసము) యొద్దకే రావలెను. 'రండి'లో అన్నీ ఉన్నవి. ప్రయాసపడి, సమస్తమైన వారలారా!, నాయొద్దకురండి, వినండి, చివరకు ఆయన న్యాయ సింహాసనములో కూర్చున్నప్పుడు, వినలేదని ఎవరైనా చెప్పితే వారికి జవాబు ఋజువులతో చెప్పును. నీవు ఎక్కడ ఉన్నావో అక్కడే వినలేదా? అని అడుగును. అపుడు ఎవరును వినలేదని చెప్పలేరు. 'ఇంతటి అన్యాయ బుద్ధి ఉంటే ఎట్లా రక్షింపబడగలను' అని ఎవరు నిరాశపడనక్కరలేదు. ఆయన పిలుపులోనే ఆ రక్షించే నైజమున్నది. ఎవరు చిక్కులలో ఉందురో వారికి వినబడును. చెవిటివారికి వినబడును. చెవిగలవారు 'విసను' అని చెవులలో వ్రేలుపెట్టికొనేవారికి సహితము వినబడును. ఈ పిలుపుయొక్క ఫలితము ఒక్కటే 'రావడము'. ఇంకా ఫలితము రావడము కారణము, లేదు. అందరు రావడములేదు. కొంతమంది మాత్రమే వస్తే సమస్తమైన వారలారా అను పిలుపుయొక్క, ఫలితముయొక్క ఫలితము నెరవేరదు. 'రాలేమండి' అంటే పొరపాటు వారిదే. యేసుప్రభువు రాజవీధిలో ఏ రాజవీధిలో గుంటూరుయొక్క రాజవీధిలో ప్రపంచముయొక్క రాజవీధిలో– అందరినీ అనగా ప్రయాసపడి భారము మోసికొనుచున్న వారినందరినీ. నాయొద్దకు రండి! రండి! రండి!



Bible Mission HQ Guntur

అని పిలుస్తున్నారు గానీ భారము మోసికొనుచున్న మానవులలో విచారము, బిడియము, రెండు ఉన్నవి.

గనుక వారు దేవుని ముఖము చూడలేరు గాని వృక్షముఖము చూడగలరు. వృక్షమా వారిని దాచేది? ప్రభువా! ఇద్దరిని కలుగజేసిన ఆయన రెండు చేతులు చాపి బిడియ పడేవారిని, విచారపడేవారిని రక్షించడానికి ఎక్కడా? అని పిలుస్తున్నారు. రాజవీధిలో, సువార్త కూటములలో ఆయన నిలిచి పిలుస్తున్నారు. 'సమస్తమైన వారలారా' అంటే ప్రభువు కాలములోనివారు, నవీన కాలములోనివారును, సమస్తమైనవారును అని అర్ధము. ఇంకొక పర్యాయము ఆయన రెండు చేతులు చాపియున్నారు. ఎందుకనగా, విచారములో, పాపములో, చిక్కులలో మరలా చిక్కుకొనకండి. ఇంకొక చిన్న సంగతి. ఒక కుంటివానిని చూచి 'నాయొద్దకు రా' అని పిలిచినారు. ఎంత సబబుగా ఉన్నది? కుంటివారు రాగలరా? హేళనగా ఉన్నది. గానీ కుంటుతూ వచ్చేవారికి ఆయన పిలుపు సత్తువ కలిగించు శక్తియై ఉన్నది. నీ పరుపెత్తుకొని నడువమన్నారు. అతడు నడువలేనన్నాడా? నడిచాడా? లేదా? ఆయన మాటలోనుండి శక్తి వచ్చినది. గనుక నడిచినాడు. పిలుపుతోపాటు ఆయన శక్తి పంపుతారు. భూదిగంతముల వరకు ఆయన శక్తి వెళ్లుచున్నది. శక్తి సప్లయి చేస్తారు. అన్నిటిలోను యేసుప్రభువు తీసికొని రాగలరు. పొదలో చిక్కుకొన్న పొట్టేలును విడిపించిన ప్రకారము ప్రభువు వచ్చి వాటిని తీసివేయగలరు. చిక్కులలో ఉన్నవారిని విడిపించువారైయున్నారు. ఈ శుభ వర్తమానము వల్ల అందరికి మేలు కలుగునుగాక! ఆమేన్.

# రక్షణదారి ఆహ్వానము

**బైబిలు పాఠము: యోహాను. 3:16.**

వాక్యపేక్ష ప్రియులారా! వాక్యాహ్వానము అందుకొని వాక్యాకర్షణలోనికి వచ్చినవారలారా! వాక్యానంద సంపూర్ణత మీకు కలుగునుగాక! ఆమేన్.

ఉదయకాలము రాజవీధిలోని వర్తమానము విన్నాము. ఆ వర్తమానము అందరికిని. ఇప్పుడు ద్వారమువద్ద వర్తమానము నేర్చుకొందాము. ఇది అందరికి కాదు. ఏర్పాటు సంఘముయొక్క ద్వారము దగ్గర వర్తమానము. ఎవరైతే రాజవీధిలో వర్తమానము విని, ద్వారముదగ్గరకు వస్తారో వారికే ఈ వర్తమానము. అక్కడనుండి మందిరములోనికి పరిశుద్ధ స్థలములోనికి రావలెను. యోహాను 6:37; మత్త. 11 చివరిలో ఉన్నది. నాయొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును త్రోసివేయను. ***రాజవీధిలోని వర్తమానము బహువచనము. ద్వారము దగ్గరి వర్తమానము ఏకవచనము.*** నేను పిలిచినాను గనుక త్రోసివేయను. ఇది ప్రతివారికి సంబంధించినది. ప్రభువు ద్వారము దగ్గర ద్వారపాలకుడుగా ఉన్నారు. నేనే మార్గమునైయున్నాను, నేనే ద్వారమునైయున్నాను. నా ద్వారా వస్తే గాని ఎవరును లోపలికి వచ్చుటకు వీలులేదు. ద్వారముమీద వ్రాత "నాయొద్దకు వచ్చువానిని.....యోహా. 3:16వ వచనము. ప్రతివాని నిమిత్తమును ఆ వాక్యము ఉన్నది. ప్రభువు సత్కార వాక్యములద్వారా ద్వారమందు దగ్గర నిలువబడి, వచ్చువారిని లోపలికి తీసికువచ్చేవారైయున్నారు. భోజనమైన తరువాత రాత్రివేళ నీకొదేము అనే పండితుడు ఆయన వద్దకు వచ్చినాడు.

ఒక్కడే వచ్చినను ఒక్కడవే వచ్చినావా! అని అనలేదు. ఆ ఒక్కనికే బోధించినారు. 10మంది వరకు ఆయన చూడరు. ఆ ఒక్కరు వచ్చినా వారిని లోపలికి ప్రవేశ పెట్టినారు. అందరూ, సమయము కొరకు, వీలుకొరకు కనిపెట్టుదురు. అయినను ప్రభువు వచ్చినవారిని చేర్చుకొనుచునే ఉండును. ద్వారపాలకుని పని కనిపెట్టేపని గనుక ఆయన ద్వారము తెరిచేయుంచుదురు. ఆయన సత్కరించుచునే ఉన్నారు. రెంటికి చిన్న భేదమున్నది. 'భోజనమునకు అందరు రావలెను' అని పిలిస్తే కొంతమంది రాకపోవచ్చు. కాని వచ్చినవారు సందేహించుటకు వీలులేదు. 'అందరిని రమ్మని పిలిచినాను గాని నిన్ను రమ్మనలేదుగదా' అని అనరు. గనుక నీవును రావచ్చును. ఆయన అందరినీ చేర్చుకొనే తండ్రియై యున్నారు. రాజవీధిలో పిలిచే తండ్రి, ద్వారము దగ్గర సత్కరించే తండ్రి; ఒక్కరు వస్తే ఒక్కరికికూడ సమాధానముచెప్పి, లోపల ప్రవేశపెట్టే తండ్రి, ఎండవేళ దాహమైనప్పుడు ఒకరికే వర్తమానమిచ్చి ఒక్కరినే రక్షించినాడు. గ్రామములోనికి వెళ్ళి అందరిని తీసికొనిరాగా అందరిని రక్షించినాడు. 10మందితో రావడము మనకు బిడియము.అందరూ చూస్తే, పడతారుగనుక ఒక్కరే రావచ్చును.

2వ విషయము: 'త్రోసివేయను'. ఎవరైనా సరే, వస్తే, ఆయన ఆదరిస్తారు, చేర్చుకుంటారు. గనుక 'నన్ను చేర్చుకొనరు' అని తలంచకూడదు. నాయొద్దకు వచ్చువారిని త్రోసివేయను. మిక్కిలి సంతోషకరమైన మాట చేర్చుకొందును. రాజవీధిలో బైలుదేరిన ఆయన పిలుపును అందుకొని, ఆహ్వానమును ద్వారా ద్వారము దగ్గరకు వచ్చినారు. గనుక త్రోసివేయరు. రమ్మంటే విని ఆనందించి వచ్చినాను, గానీ మధ్య సందేహములు

పుట్టినాయి. నేను పాపిని, నిన్ను రమ్మన్నానా అని అంటారా! అని భయపడుదురు గనుకనే త్రోసివేయనని చెప్పినారు. త్రోసివేసేవాడనైతే మీరున్న స్థలమునకు ఎందుకు వస్తాను? త్రోసివేసేవాడైతే అందరిని ఎందుకు పిలుస్తాను? మనము సందేహిస్తాము గనుక త్రోసివేయనన్నారు. తప్పిపోయిన కుమారుని సందేహించక చేర్చుకున్నారు. అదే తండ్రియొక్క రక్షణ. మానవులు ప్రభువును త్రోసివేయవచ్చు, వర్తమానములు త్రోసివేయవచ్చును, గానీ ప్రభువు వారిని త్రోసివేయలేదు. అందరి కొరకైన ఆహ్వాన వర్తమానము ఒక్కొక్క వర్తమానముగా ప్రత్యక్షమైనది. గనుక ఆనందింపవలసినదే. ఏకారణముచేతనైన త్రోసివేయడు. ఆది. 3: 15లో రక్షణ వాగ్ధానము ఉన్నది. యోహాను 3:16లో రక్షణ చరిత్ర తెలియపర్చినారు. ఆది సువార్త 3:15లో ఉన్నది. అందులోనే బైబిలంతా ఇమిడియున్నది. ఆది. 3:24లో బైటకు వెళ్ళిపొండనే మాట చెప్పినారు. ఏదేను తోటలోని సాదృశ్యము. మామిడి తోటలో ఉన్న ముసిడిచెట్టు పండును ఆ తోట యజమానుని కుమారుడు తినెను. అపుడు తండ్రి ఆ కుర్రవాని చేతులు కడిగి. ఇంటికి పంపి ఎప్పుడు ఇక తోటకు రావద్దు. నీకు కావల్సినవి నేనే తెస్తానని చెప్పిరి. ఎంత మంచిమాట! ప్రకటనలో ఏడేండ్ల శ్రమలో శ్రమానుభావశాలులు వస్తే, కోటానుకోట్లు రక్షించబడినవారుగా చేర్చుకొనబడినవారుగా ఉన్నారు అని ఉన్నది. కాబట్టి మనము మిక్కిలి సంతోషముగా ఉండవలెను. 'ఆకాశము, భూమి గతించునుగాని నా మాటలు ఏమాత్రమును గతింపవు. నాయొద్దకు వచ్చువానిని నేను త్రోసివేయను'. ఏ మాత్రము దేనికైనా రావద్దు అనను, దేనినైనా త్రోసివేయను. త్రోసివేయటము ఒక క్రియ. సందేహము కూడదు.

దేనికైనా అనేది ఒక పలుకు. హాస్యమునకైనా త్రోసివేయను. గనుక మనము ఆయన దగ్గరకు వచ్చుటకు ఏమాత్రము సందేహింపకూడదు. రావలెనని ఉద్దేశ్యము కలిగినప్పుడు వచ్చి వేయవలసినది. ఉదా: నా యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రము త్రోసివేయలేదు. నాయొద్దకు నా కుమారుడు వచ్చినాడు గనుక త్రోసివేయను. చిన్న కుమారుని కథలో అంతా చెడుగే ఉన్నది. కాని ఒక మంచి ఉన్నది. అదేమంటే ఆయన వద్దకు వచ్చుట. రావడము తండ్రికి ఇష్టమైన కార్యము. కుమారుడు వచ్చిన లక్షణముచూచి తండ్రి సంతోషించినారు. రావడమనేదే మంచి క్రియ. ఆ రావడమునుచూచి తండ్రి బహుగా సంతోషించినారు. ఎంత పాపియైన సరే. ప్రభువు వద్దకు వస్తే పాపి, కుమారుడుగా మారిపోవును. 1. త్రోసివేయను, 2. ప్రతివారు 3. నాయొద్దకు, 4. రావడమనే సుగుణము. ఈ మహా దివ్య వాక్యమును మీ హృదయములందు ముద్రించు కొందురుగాక! ఉదా: వినబడే వర్తమానము త్రోసివేయను. అందరికేనా? కొందరికేనా? అని ప్రశ్నవస్తే జవాబు ఒక్కొక్కరికి కూడా అని చెప్పవలెను. తండ్రియొద్దకు వచ్చు ధన్యత ఆత్మ తండ్రి చదువరులకు అనుగ్రహించును గాక! ఆమేన్.

# రక్షణదారి పాఠములు

## మత్తయి 16:24; మార్కు. 1:21.

ఆహ్వాన ఉద్యోగముయొక్క మొదటి వర్తమానములో 0 (సంపూర్ణము) ఉన్నది. మందిర ద్వారముయొద్ద ఉన్న ఉపదేశములో రెండవ వర్తమానములో 0 (సంపూర్ణము) ఉన్నది. అక్కడే భూగోళమంతా ఉన్నది. ప్రజాసంఘమున్నది. ఆయన రక్షణాహ్వానమును వినడము, అంగీకరించడము, రావడము ఉన్నది. అనగా 1. వినడము, 2. పరీక్షించడము, 3. అంగీకరిండము, 4. రావడము ఉన్నది. యేసుప్రభువుయొద్దకు వచ్చేవారి పాపములన్నీ పరిహారమగును. గనుక రండి. ఇది శుభవర్తమానము.

2. ఎందుకంటే ఆ పాపమువలన కలిగిన దుష్ట ఫలితములన్నిటినీ, పరిహరించుకొనేటందుకు రండి.

3. 'మీరు నిత్యము నాయొద్ద ఉండిపోవలెను. అనగా పరలోకము వచ్చిన తరువాత నాయొద్దనే నివసింపవలెను. ఈ మూడు కోర్కెలు కలిగి రండని పిలిచినారు. ఆయన సన్నిధిలో శాశ్వతకాలము నివసింపచేసేటందుకు 'శిష్యులారా! మీరు భూదిగంతములవరకు నాకు సాక్షులైయున్నారు'. శిష్యులపని పరీక్షింపగా, ఆ సందేశము లోకమంతటికి వెళ్ళిపోయినది. కాని ఒక్కరికే వెళ్ళలేదు. మందిరములోని శిష్యులద్వారా ఆయన రక్షణాహ్వానమును అందుకొని, ద్వారము దగ్గర ఆయనచే ఆహ్వానించబడి, లోపలికి అనగా మందిరములోపలికి తోడుకొని వెళ్ళబడినవారికి వర్తమానము ఏమనగా మీరు నాయొద్ద నేర్చుకొనండి. మందిరము వెనుక వర్తమానము– మీరు నా

కాడినెత్తుకొనండి. పరలోక ద్వారముమీద ఉన్న వర్తమానము ఏమనగా: మీరు నాయందును నేను మీయందును ఉందును.

**3వ సందేశము:** నాయొద్ద నేర్చుకొనండని మందిరములో వ్రాసియున్నారు. గనుక ఇదియొక పాఠశాల. ఇందులో ఆయన కూర్చుని బోధించుచున్నారు. నేర్చుకొనవలసిన విషయములు అనేకములు నేర్చుకొనవలెను. నరలోకమునుగూర్చి పరలోకమునుగూర్చి నేర్చుకొనవలెను.

ఆయన -1. రాజవీధిలో ఆహ్వానకర్త.

2. ద్వారము వద్ద ద్వారపాలకుడు.

3. మందిరములో ఉపాధ్యాయుడుగా కూర్చుని ఉన్నారు. ఒకరి తరువాత ఒకరు వస్తున్నారు. మరి ఆ మందిరములోని బోధనాంశములు ఏమిటి?

1) పాపపరిహారాంశము, 2) పాప ఫలిత పరిహారాంశము 3) మీరు నా సన్నిధిలో శాశ్వతముగా ఉండవలెను. ఇది దేవుని సన్నిధి. ఇది భాగ్య వరప్రసాదము. ఈ మూడు గొప్ప పాఠములుఆయనే ఈ మందిరములో స్వయముగా నేర్పించుచున్నారు. వీటికి సంబంధించిన గొప్ప పాఠములుకూడా వాక్యములో ఉన్నవి. యూదుల ఆచారము కూర్చుండి బోధించుట. దేశములో, జనాంగములో, దేవాలయములో; మూడు ముఖ్య విషయములు బోధిస్తున్నారు. మార్కు 1:21-27 నాలుగు సువార్తలు కలిసి క్రీస్తుయొక్క జీవితచరిత్ర అగును. క్రీస్తువారి జీవిత చరిత్రలో, ఆయన ఉద్యోగములోని వర్తమాన వాక్యములే బోధలు. ఆ బోధలు వింటే మనశ్శాంతి కలుగునని, రోగులకు స్వస్థత కలుగునని ప్రజలందరూ వచ్చేవారు. దయ్యము బయటికి రావలెనని ప్రభువు చెప్పిరి. అపుడు అది బయటకు వచ్చినది. వానిని విలవిలలాడించినది, వెళ్ళిపోయినది. ఇదివరకు బోధ

ఇప్పుడిది క్రియ. ఆయన సందేశము ఎన్ని విధములు? మాట, క్రియ. వాక్కు మూలముగా సందేశము; క్రియల మూలముగా నెరవేర్పు. ఈలాగు సర్వ ప్రపంచములకు ఆయన తన వాక్కును, క్రియను పంపుచున్నారు.

1. వాక్కు రూపము,

2. క్రియా రూపము,

3. వ్రాత రూపము. ఈ మూడు రూపములకు ఆశ్చర్యపడిరి, విస్మయమొంది, ధర్మశాస్త్రము చదువుకొని, ఆనందపడుచున్నారు. అప్పుడు ఆనందించినట్లు ఇప్పుడును అనేకులు ఆనందించుచున్నారు. ఆలకించవలెను, పరీక్షించవలెను, అంగీకరించవలెను. రావలెను, అనుభవించవలెను, ఆయన బోధలేమిటి అని అవన్నీ పరీక్షింపవలెను. ఆయన బోధల జాబితా పెద్దది. బోధ మూలముగా ఆయన చేసిన బోధలోనున్న అంశములలో నరహత్య చేయువద్దు, వ్యభిచరించవద్దు, అప్రమాణము చేయవద్దు అనునవి పర్వతముమీద చెప్పిన ధర్మ ఉపదేశములో ఉన్నది. వేదశాస్త్రజ్ఞులు బోధించిన బోధలో ఇవి ఉన్నవి. అయితే ప్రభువు- చంపనక్కరలేదు, కోపపడితే చాలు అదే నరహత్య, నరహత్యతో సమానము అని చెప్పిరి. ఇది విపరీతమైన బోధగా ఉన్నది. 2. కోపపడవద్దు 3. క్షమించమన్నారు. 4. ప్రార్థించుము శత్రువుల వలన అపాయము కలిగితే సంతోషించవలెనని అన్నారు. 5. దీవించవలెను. మనమే దీవించవలెనట. ఈ శక్తి ఏలాగు వచ్చును. మీరు మొదట ఆ పని చేస్తే, ఆ శక్తి వచ్చును.

మీరు మొట్టమొదట మీకొరకు ప్రార్థించండి. అపుడు ఉండకూడని వాటిని విసర్జించగలరు ఆ పిదప ఎవరినైనను దీవించగలరు. అక్కడ అందరు ప్రభువుయొక్క ఈ క్రొత్త బోధ

విని మన శాస్త్రులవలెకాక, వేదాంత పండితులవలెకాక అధికారము గలవానివలె బోధించెను అని ఆశ్చర్యపడ్డారు. ఇందులో రెండు వద్దులు ( నరహత్య చేయవద్దు, కోపపడవద్దు). మూడు కావలెను (క్షమించవలెను, ప్రార్థించవలెను, దీవించవలెను). ఈ ఐదు బోధలేగాని, దయ్యములను వెళ్ళగొట్టుట ఇది క్రియ. 1) బోధ, 2) క్రియ. బోధకుడు బోధమూలముగా వర్తమానము అందించవలెను. క్రియ మూలముగా సందేశము అందించవలెను. బోధ చేయవచ్చు గాని క్రియ మూలముగా చేయలేరు. బోధించిన ప్రకారము ఎవ్వరు నడుస్తారో వారే పరలోకములో ధన్యులు. కొందరు నడవలేకపోవుచున్నారు. 1. బోధించుట = క్షమించుట, 2. నడచుట = క్షమించుట, 3. క్రియ = అద్భుత క్రియ చేయుట.

బోధవేరు, అద్భుతక్రియ వేరు, ప్రవర్తన వేరు; ఈ మూడు ప్రభువు కాలములో ప్రత్యక్షమైనవి. ఇప్పుడుకూడా అలాగే జరుగుచున్నది. శ్రమ చరిత్రలో ఏమి తెలుస్తున్నది? ఆయన వారిని హింసించలేదు. హింసించుటకు రాలేదుగాన, క్షమించినాడు. దూషణ, శాపము ఆయన చేయలేదు. ఆయన చెప్పినట్లు చేసినాడు. ఇదే క్రొత్త బోధ. సిలువమీద బోధలో ఇరు పార్శ్వములలో బందిపోటు దొంగలున్నారు. వారివైపు జాలితో చూచి క్షమించినారు. బాగుపడితే బాగుండాలని తలంచినారు. తుదకు ఒకడు అంగీకరించెను. అందుకు ప్రభువేమి చేసినారు? ఆ చివరిలో బందిపోటు దొంగయొక్క కడవరి చరిత్ర ఉన్నది. ఇది మందిరములో జరిగిన కథ. అనగా బోధించిన చరిత్ర మందిరములో జరిగినది. ప్రవర్తనద్వారా రక్షించిన చరిత్ర సిలువపై జరిగినది. దొంగను ప్రభువు రక్షించినారు. ఇది చివరి క్రియ. ఏవిధముగా రక్షించినారు? ప్రవర్తన ద్వారా! ఇది

అద్భుతములకు మించిన అధ్భుతము. ఏమి ప్రవర్తన? జాలిచూపుట. ఆ చూపులో జాలి, పేతురును చూచిన జాలిచూపు ఇదే. అనకూడదు గాని ప్రభువు చూపుకు పేతురు స్త్రీవలె ఏడ్చినారు. ఆ విధముగానే కుడివైపున ఉన్న దొంగనుకూడ తన జాలి ప్రవర్తనలోని చూపువల్ల మార్చివేసినారు. రెండవ దొంగ ఆయన శాంతిప్రవర్తన చూడలేదు. నన్నెందుకు సిలువవేసినారు అనే గొడవలో ఉన్నారు. అందునుబట్టి ఆయన ప్రవర్తనా ప్రభావమును అతడు చూడలేదు.

1. దూషణ, 2. అపార్ధము, 3. సమస్త పాపములనుండి రక్షణ. అదే అన్ని క్రియలలో గొప్ప క్రియ. క్షమించినారు, ప్రార్ధించినారు, దీవించినారు; అనలేదుగాని నేను నిన్ను రక్షించలేను రక్షించి నీవు నాతోకూడ మోక్షములో ఉంటావు అన్నారు. పరదైసుకు తీసికొని వెళ్ళినారు. దొరకాని దొర. ఇతడు మొదట దొంగ తరువాత దొర. ఇది ఆఖరు ఉపకారము. ఇప్పుడు రక్షింపబడవచ్చు. ఆఖరు స్థితి ఏమగునో! ఒకసారి పడితే లేస్తారు. రెండవసారి పడిపోతేనో! గనుక ప్రభువు వచ్చి పడిపోకుండ చేయవద్దు, తనతో తీసికొని వెళ్ళెను.

ఉపకారములు: 1. నరహత్య చేయువద్దు, 2. కోపపడవద్దు, 3. క్షమించుట, 4. ప్రార్ధించుట, 5. దీవించుట, 6. రక్షించుట, 7. పరలోకమునకు తీసికొని వెళ్లుట. క్రియచూచి కపెర్నహూములో 'క్రొత్త బోధ' అన్నారు. చివరకు చూస్తే గొప్ప బోధ. గనుక ప్రభువుకు మహామహోపాధ్యాయుడు అను బిరుదు గలదు. ఈ సందేశము అందరి హృదయములకు చెందునుగాక, అందునుగాక. ఆమేన్. కీర్తన: ఉపకారినుతినీకౌ, రక్షకానా వందనాలు.

Bible Mission HQ Guntur

# పెంతెకొస్తు - ఆత్మస్నానము

## అపో॥కార్య॥ 2:1-4.

ప్రార్థన:- ఆత్మస్వరూపుడవైన తండ్రీ! సర్వసృష్టికి ఆధారమైన తండ్రీ! మీ పావన ఆత్మతో మా మానవ హృదయములను నింపుము. అపుడు మాకు ఆత్మానందము, ఆత్మోద్రేకము, ఆత్మోత్సాహము కలుగును. మీ మహిమ జ్ఞానముతోను, ఆత్మజ్ఞానముతోను, భవిష్యద్ జ్ఞానముతోను మా మానవ జ్ఞానమును నింపుము. అపుడు నీ అంతరంగములోని అన్ని సంగతులు గ్రహించగలము. ఈ కాలమునకు మీరు బైలుపర్చినవన్నియు గ్రహించగలము. తండ్రీ! మీ పరిపూర్ణాత్మతో, మా మానవ మనస్సాక్షిని నింపుము. అపుడు మీరు బోధించిన ప్రకారము, ప్రత్యక్షపర్చిన ప్రకారము నడుచుకొనగలము.

పరిశుద్ధాత్మనకు మా హృదయమును శుద్ధిచేసి తండ్రీ, నీప్రేమ ఎప్పుడు ఒక్క రీతిగానే యున్నది. తండ్రీ మారు కుమ్మరింపుగా వచ్చిన చరిత్రకు అప్పుడే ఆక్షేపణలు కాని నీ శిష్యులకు ఎల్లప్పుడూ జయము.  మా అందరి హృదయములలో నివసించే తండ్రీ! వందనములు. ధనికుల మేడలలో, బీదల చిన్న ఇండ్లలో నివసించే తండ్రీ నిన్ను వేడిన యెడల మా హృదయములలోకూడ నుందువు. అట్టి ధన్యత నేడు మాకు దయచేయుమని యేసునామమున వందించుచున్నాము తండ్రీ! ఆమేన్.

ఆత్మ తండ్రిని నింపుకొనుటకు వచ్చిన వారలారా! మన మొదటి పండుగ క్రిస్మసు 2. ఈస్టరు. 3. పెంతెకొస్తు. ఇవి ప్రతి సంవత్సరములో వస్తున్నవి. ఒక్కొక్క నెలలో వస్తున్నవి.

చాలాకాలము నుండి ఈ పండుగ ప్రసంగములు వినుచూనే యున్నాము. అయితే, ఈ పండుగ ఏదనగా, మీరు నేను మాట్లాడి ఊరుకొని ఉన్నదే పండుగ. వారు కనిపెట్టిరి గనుక ఆత్మ చెప్పెను. గనుక ఈ కుమ్మరింపు పండుగ, కనిపెట్టే పండుగ. ఇది వరకు ఆత్మపొందిన వారికి ఉద్రేకము, క్రొత్త వారికి ఆత్మ బాప్తిస్మము జరుగును. అది పెంతెకొస్తు పండుగ. క్రిస్మసుకు తండ్రికి స్తుతి. మంచి శుక్రవారము కుమారునికి స్తుతి ప్రాణమిచ్చినందుకు. పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్మకు స్తుతి. ఆయనే తనను తాను మనకు ఇచ్చివేసికొనెను.

తండ్రి తన కుమారుని ఇచ్చెను. ఆత్మనుకూడ ఇచ్చెను. తండ్రి జరిగించిన పై రెండు కథలు, ఈ దానముల సంగతి తెలిసికొనుటకు మధ్యను బైబిలు గ్రంథము ఇచ్చెను. బైబిలు లేకపోతే, తండ్రి తన కుమారునిచ్చిన, ఆత్మ నిచ్చిన సంగతి తెలియదు. త్రియేక దేవుడిచ్చిన దానములు ఏవనగా, ఆయన కుమారుని దానము, ఆత్మదానము బైబిలు దానము, దేవునికి అనేక స్తోత్రములు. ఆయన చేసిన ధర్మములు అన్నిటిలో ఏది గొప్పది? ఏది మొదటిది? అన్ని మొదటివి? అన్నీ గొప్పవి, అన్నీ చివరివి. కుమారుని గురించి, ఆత్మ గురించి, తండ్రి గురించి బైబిలును గురించి బైబిలు వల్లనే తెలిసికొనుచున్నాము. వివరము మాత్రము పరిశుద్ధాత్మవల్ల తెలిసికొనుచున్నాము.

**ఈవేళ పరిశుద్ధాత్మ బాప్తిస్మ కథ:-**

పాదిరిగారు నీళ్ళతో బాప్తిస్మము ఇచ్చెదరు. అయితే క్రీస్తు ప్రభువు పరలోకమునకు వెళ్ళి పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చెను.

క్రీస్తుప్రభువు ఏమి చెప్పెను? ఆదరణకర్తను పంపిస్తానని చెప్పెను. ఇది క్రీస్తుప్రభువు ఇచ్చేది. క్రీస్తుప్రభువుల వారు బాప్తిస్మము పొందిన వెంటనే ఆత్మ బాప్తిస్మముకూడ పొందెను. ఆయన వెంటనే పొందెను, తర్వాత పొందలేదు. న్యాయము చొప్పున మనమును అలాగే పొందవలెను అనగా రెండు బాప్తిస్మములు ఒక్క పర్యాయమే జరుగవలెను. ఆలాగు జరుగకపోవుటకు కారణములు మనకు తెలియదు. క్రీస్తు ప్రభువుపొందినట్లు తెలియును గాని మనము అట్లు పొందవలెనని తెలియదు. తర్వాత పొందు చున్నాము.

తెలిసినది రెండూ ఒక్కసారే పొందవలెనని గనుక బాప్తిస్మమొక్కటే. రెండును ఒక బాప్తిస్మములో కలిసే ఉన్నవి. విడదీయ వీలులేదు. క్రీస్తు ప్రభువునకు నీళ్ళ బాప్తిస్మము యోహాను మనలాంటి (బహిరంగముగా) మనిషివలె ఇచ్చెను. క్రీస్తుప్రభువుకు తండ్రి పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఇచ్చెను. మనకును క్రీస్తుప్రభువు ఆత్మబాప్తిస్మము ఇవ్వవలెను. నీటి బాప్తిస్మము తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ యొక్క ఏక నామమందు వస్తున్నది. అందులోనే రెండు అనుభవములు జంటగానే యున్నవి గాని తెలియదు. పాపమువలన ఎడముగా నున్నాము. గనుకనే నదిలో, నీళ్ళలో, స్నానము పొందుచున్నాము. అయితే ఆత్మబాప్తిస్మము ఎప్పుడు?

నమ్మి స్నానము పొందిన రక్షణ పొందుదుము. అయితే నమ్మి రక్షణ పొందిన తర్వాత పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎందుకు? త్రియేక దేవుని నామమున రక్షణ ఇచ్చెను. అప్పుడు తండ్రిని కుమారుని మాత్రమే ఎరుగుదుము గానీ ఆత్మ తండ్రిని వ్యక్తిగతముగా, పూర్తిగా, అనుభవపూర్వకముగా ఎరుగముగదా!

ఆలాగు ఎరిగినపుడే నామకార్థ క్రైస్తవ సంఘములోనుండి అంతరంగ సభలోనికి రాగలము. ఆలాగున ఆ కాలములో త్రియేక దేవుని నామమున రక్షణపొందిన వారిని ఆయనే మేడగదిలోనికి చేర్చెను. చేరిన తర్వాత ఏమి పని లేదా? 120 మంది పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది అన్య భాషలలోను సువార్త ప్రకటన జరిగించిరి. అదివరకు చేసిన ప్రకటనలో సంపూర్ణ సువార్త ప్రకటించలేదు. ప్రభువుయొక్క మరణము కథ, పునరుత్థాన కథ, ఆరోహణ కథ, ప్రకటించలేదు. అంతకుముందు క్రీస్తు ప్రభువు జన్మము, అద్భుతములు చూచినాము, ఆయనతో ఉన్నాము అని చెప్పిరి. అప్పటికి పైవి జరుగలేదు గనుక బోధించలేదు. సిలువ, పునరుత్థాన ఆరోహణలు జరుగలేదు. ముఖ్యమైనవే జరుగలేదు.

ఈ 3 గొప్ప నిత్య చరిత్రలు జరుగలేదు. గనుక చెప్పలేదు. అయితే ఇప్పుడు వారు ఆత్మబాప్తిస్మము పొందిరి గనుక సంపూర్ణ సువార్త ప్రకటించగలరు. క్రొత్తవి కూడా చెప్పగలరు. పరిశుద్ధాత్మ కుమ్మరింపు చరిత్రకూడా చెప్పగలరు. మేము ఇప్పుడే పొందినాము. మీరును పొందండి. గనుక పెంతెకొస్తు పండుగప్పుడు చేసినది సంపూర్ణ సువార్త. **"మనముకూడా సంపూర్ణ సువార్త చేయవలెను".** అని చెప్పితేనే సంపూర్ణ సువార్త యగును. ప్రభువు చరిత్రలోనివి అన్ని ఎంత ముఖ్యమో, పరిశుద్ధాత్మను పొందుటకూడ అంతముఖ్యము. అదికూడ త్రియేక దేవుని పనియే శిష్యులిది గ్రహించగలిగిరి. మన కాలములో క్రొత్తది రెండవ రాకడ జరుగనైయున్నదని చెప్పుచున్నాము. అయితే పరిశుద్ధాత్మ బాప్తిస్మము జరిగెనని చెప్పుదుము.

ఉదా:- 12గం॥లకు భోజనం చేసారా? అని 4 గం॥కు అడిగితే అన్ని చేసినట్టే. మీరు స్నానం పొందారా? అంటే నీటి బాప్తిస్మము, ఆత్మ బాప్తిస్మము పొందినారా అనే అర్ధము. క్రీస్తుప్రభువు అట్లు పొందెను. ఒక్క స్నానములోనే రెండును పొందెను. 1) నీళ్ళు 2) ఆత్మ. ఇంకొకటి. 3) అగ్ని. ఈ మూడింటి స్నానము ఒకటే. అన్నము తిన్నావా అంటే కూరతినలేదా! నీళ్ళు త్రాగలేదా? అన్నితిని, త్రాగినట్లేగదా! అలాగే స్నానము అంటే అన్ని అని అర్ధము.

క్రీస్తుప్రభువు నీళ్ళ బాప్తిస్మము, ఆత్మ బాప్తిస్మము ఎప్పుడు పొందవలెను. 1) ఒకే సమయమందా? 2) కొంచెను సేపు అయిన తర్వాతనా? యోహాను బాప్తిస్మము ముగించి ఒక నిమిషము అయిన తరువాత వెంటనే పొందెను. మనకు చాలా ఆలస్యమైపోతుంది. ఈ ఆత్మబాప్తిస్మమును అంత్యదినము వరకు పొందుచూనే యుందురు.

నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షణపొందును. అపో॥కార్య॥ 2:38. 1) మారుమనస్సు 2) పాప క్షమాపణ పొందుట 3) అప్పుడు పరిశుద్ధాత్మ వరము పొందుదురు. గనుక మొదటిది నీళ్ళ స్నానము రెండవది పరిశుద్ధాత్మ బాప్తిస్మము. అది క్రమము. రెంటికి దూరమున్నదా? క్రీస్తుప్రభువు బాప్తిస్మములో రెండు స్నానములకు 1 నిమిషము ఎడము. అయితే పేతురు చెప్పినదానిలో "అప్పుడు" అన్నదానిలో మూడు అక్షరములు అనుటకెంత సమయము పట్టునో, అంత సమయములో ఆత్మబాప్తిస్మమునుకూడ అపుడే పొందవలెను. మార్కు 1:10లో వెంటనే అని వ్రాయించుటకును, పేతురు చెప్పిన అప్పుడు అనుమాటకు సంబంధము కలదు.

రెండు ఒక్కసారే గనుక వెంటనే అని కనబడుచున్నది. మనము అంత ధన్యులము కాలేదు. ఎప్పుడు పొందాము. క్రీస్తుప్రభువు చరిత్రలోను వెంటనే; పేతురు అనుభవ సాక్ష్యములోను వెంటనే అని ఉన్నది. దీనిలో రెండు కథలు కలవు.

120 మంది పరిశుద్ధాత్మను పొందటము చాల ఆలస్యము. క్రీస్తుప్రభువు ఎప్పుడో చెప్పెను. యోహానుకూడ ఎప్పుడో చెప్పెను. వారు మొదట యోహాను శిష్యులు. క్రీస్తుప్రభువు పరలోకము వెళ్ళిన తర్వాత ఆత్మ బాప్తిస్మమును గూర్చిన సంగతి వారికి తెలియబడెను. అయినను ఎప్పుడో ఒకప్పుడు పొందుట ముఖ్యము.

యోహాను పాతనిబంధన ప్రకటించెను. అది అందరికి అని ప్రకటించెను. ప్రవచించెను. యోహానుకు ముందు కొందరు ప్రవక్తలు అనగా అబ్రాహాము, సమూయేలు, యోవేలు ప్రవచించిరి. అందరిలో చివరివాడు యోహాను. కొద్ది దినములలో క్రీస్తుప్రభువు ఆత్మతో బాప్తిస్మమిచ్చుననెను. యోవేలు చెప్పిన సంగతినే యోహాను చెప్పెను. క్రీస్తుప్రభువు అపో॥కార్య॥ 1వ అధ్యాయములో కొద్ది దినములలో పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుదురని చెప్పెను. ముగ్గురు చెప్పినట్టుగా జరిగెను. కొన్ని సంవత్సరములు, కొంతకాలము, కొన్ని దినములు అయిన తర్వాత ప్రవచనము నెరవేరెను. యోవేలుకు, యోహానుకు మధ్య నున్నవారు ఆత్మను పొందారని లేదు. యోహాను మొదలు క్రీస్తుప్రభువు ఆరోహణము వరకు, ఆత్మకుమ్మరింపు మధ్య వరకు ఎవరు ఆత్మబాప్తిస్మము పొందలేదు.

పెంతెకొస్తు దినముననే పొందవలెను. వారికి వాగ్ధానము, మనకును వాగ్ధానము. ఇది జరుగుచుండెను. పెంతెకొస్తు ముందు జరుగలేదు. ఆరోహణము తర్వాత నియమింపబడినది. ఈ బాప్తిస్మమునుగూర్చి ఎవరిని అడిగిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినావా అని అడిగితే తెలియదంటారు. ఈ కాలములో కొందరు అక్కరలేదంటున్నారు. కావలసినవారు మాత్రమే పొందండి. పొందితే చెప్పవలెనా? శిష్యులు పొందిరి గనుక పొందితిమని చెప్పిరి. 1. మారుమనస్సు 2. పాపక్షమాపణ 3. బాప్తిస్మము తర్వాత ఆ వరము పొందుదురని చెప్పిరి. గనుక మీరు పైవన్ని పొందినారా? ప్రార్థనచేసి పొందవలెను.

120 మంది 10 రోజుల ప్రార్థనచేసి కనిపెట్టి పొందిరి. పై మూడును చేసినప్పుడు పొందిరి. మనము కూడ మూడు పనులు చేస్తే పొందగలము. రాకడ సమీపమగుకొలది అందరు పొందవలెను. అట్టి మహాధన్యత నేడు మనకెల్లరకూ తన కుమ్మరింపుద్వారా ఆత్మతండ్రి అనుగ్రహించును గాక! ఆమేన్.

# ఎన్నికజనము-1

ప్రభువా! మా కన్నులు విప్పి ఆకాశమును చూచిన యెడల నీజ్ఞానము ఎంత గొప్పదో తెలియుచున్నది. సూర్య చంద్ర నక్షత్రములను అందులోని నీవు ఉంచినావు. భూమిని చూడగా జంతువులు, నదులు, మానవులు మొ॥వి ఉంచినావు. ఏది ఎక్కడ పెట్టవలెనో అక్కడ అది ఉంచినావు. సృష్టి అనే ఇంటిలో ఏది ఎక్కడ ఉంచవలెనో అక్కడ ఉంచినావు. ఈ నీ జ్ఞానమును తలంచుచు వందించుచున్నాము. బైబిలు గ్రంథములో ఒకరి సమయములో ఒకరు పుట్టలేదు. ఎవరు ఎక్కడ పుట్టవలెనో అక్కడ వారు పుట్టినారు. నీవు ఆలాగున వారిని పుట్టించినావు. అన్నిటికి మంచిక్రమము ఏర్పరచినావు. చిందర వందరగా ఏదియు నీవు చేయలేదు. ఆలాగుననే పడిన మానవులను రక్షించుటకు సంకల్పన ఏర్పరచినావు. దానికికూడ క్రమమున్నది. వాగ్ధానమెప్పుడు ఇవ్వవలెనో, మిశ్రమజనమునుండి ఏర్పాటు జనమును ఎప్పుడు వేరుచేయువలెనో, వెు॥వి ఈ ఏర్పాటులన్నియు నీజ్ఞానమును తెలియపరచుచున్నవి. మా హృదయము, జ్ఞానము, మనస్సాక్షిని, నీజ్ఞానవశము చేసికొనుము. నేడు మాకు బోధించవలసిన అంశములను వివరించుమని యేసునామమున వందించుచున్నాము తండ్రీ! ఆమేన్.

**ఎన్నిక జనము:-** ఈ జనము అబ్రాహాముతో, మొదలై, పెంతెకొస్తు వరకు వచ్చిన క్రైస్తవ సంఘము. దేవుని జ్ఞానము ఈ జనములను ఏర్పాటులో చేర్పించుటలో కనబడుచున్నది. యూదులు ఇప్పటివరకు ఉన్ననూ సంఘ ఏర్పాటులో లేరు. ఆదామును మొదటగా దేవుడు ఏర్పాటులోనికి నడిపించెను. మిశ్రమ జనమును ఎన్నికజనము కొరకు; ఎన్నిక జనమును

క్రైస్తవ సంఘము కొరకు; క్రైస్తవ సంఘమును పెండ్లికుమార్తె కొరకు దేవుడు ఏర్పాటుచేసెను.

ఎన్నిక జనమన్ననూ, ఇశ్రాయేలీయులు, యూదులు అన్ననూ అన్నీ ఒకటే. పాత నిబంధన జనమన్నను, హెబ్రీయులన్నను ఒకటే. వీరిని బయటకు తీయవలెను. దేశమును ఇచ్చి లోకరక్షకుని రప్పించవలెను. ఈ జనాంగమును తయారు చేయవలెను. వీరికి ట్రయినింగ్ (శిక్షణ) ఈయవలెను. ఈ గొప్ప పని చాలా సంవత్సరములు పట్టెను.

1. ఎవరైన తప్పుచేస్తే శిక్షించవలెను గనుక ఈ జనాంగమును ఐగుప్తునకు పంపి శిక్షించి, బుద్ధి వచ్చేవరకు నుంచెను.

2. వారు బానిస వారైయుండి విధేయతను, వినయమును నేర్చుకొనవలెను.

3. ఇకముందుకు రాజులై పరిపాలన చేయవలెను. రాజు, బీదలను, కూలీలను ఏలాగు చూడవలెనో తెలిసికొనవలెను. గనుక దాసత్వమునకు అప్పగించెను. కష్టపడి పని చేసుకునే అంతస్తు, అన్యులవలె విచ్చల విడిగా తిరగవచ్చు అంతస్థును, వారిని రాజులుగా ముందు మార్చుకొనుటకు అట్లుచేసెను. రెండు రకములైన రాజులనుగా వారిని ఏర్పరచవలెను.

4. ఐగుప్త పాటములు:- రాజులు, మంత్రులు, దాసీలు మొదలైనవారిని చూచి మేము ఈలాగు చేయవలెనని వారు అనుకొనెను.

5. బోధ:- అన్నింటికంటె ఎక్కువగా మోషేద్వారా 40సం॥లు 5 కాండములలో ఉన్నవన్నీ నేర్చుకొనిరి. గనుక వారు వేదాంత విద్యార్థులైరి.

తరువాత వారిని కనానుకు తీసికొనిపోయెను. ముందు అన్యులను వెళ్ళగొట్టవలెను గనుక సిపాయిలనుగా తయారు

చేసెను. ఐగుప్తులో వారు పటాలమును చూచిరి. యెహోషువ ఐగుప్తు సోల్జరు (సైనికుడు). ఉదా:- మోషే చేతులు దించితే ఇశ్రాయేలీయులు ఓడిపోవుట, చేతులు పైకి ఎత్తితే గెలుపు. ఇక్కడ యెహోషువ అధిపతి. అందుచేతనే యెహోషువ కనానులో 7 జనాంగములను జయించెను.

ఐగుప్తులో దాసులుగా మూల్గుచున్నారు. అడవిలో (సీనాయి ఎడారిలో) చేతులు కట్టుకొనిన విధ్యార్థులు, తర్వాత సిపాయిలు; తర్వాత పటాలము; తర్వాత రాజులుగా వచ్చిరి. ఎన్నిక జనము, దాసులు, విద్యార్థులుగా వారు భటులు తర్వాత రాజులైరి. అరణ్యములో పూజారులైరి. వారు గుడి కట్టుకొనిరి. అది గుడారము, అందులోని దేవుని, పూజించిరి. దేవునియొక్క జ్ఞానము ఏదనగా ఎన్నిక జనమును దాసత్వము అను కాడి క్రింద ఉంచి, తర్ఫీదునిచ్చి రాజులను చేసినది. 40 ఏండ్లలో అరణ్యములో అహరోనుతో పూజారులను; సౌలుతో రాజులను ఆయన ప్రారంభించిరి. ఆలాగే రేపు వెయ్యేండ్లలో సేవకులు కొందరు యాజకులు కొందరు, రాజులు కొందరు అగుదురు (1పేతు. 2:9). రాజులు పరిపాలనలో నుందురు. వెయ్యేండ్లలో గుడిలో ఆరాధన, బయట పరిపాలన ఉన్నది. ఎన్నికజనము వెయ్యేండ్లలో నుందురు. వారిలోనుండి క్రైస్తవులు, వారిలోనుండి పెండ్లికుమార్తె ఎన్నిక జనమగును. పెంతెకొస్తు తర్వాత బేధములేదు, అందరికినీ ఏర్పాటు సమానముగా నున్నది. అయితే, ఈ సంగతి కొందరికి తెలియదు గాని టైము వచ్చినప్పుడు ఆత్మ తండ్రియే తెలియచెప్పును.

అట్టి స్పష్టమైన ఆత్మ ప్రత్యక్షతలో త్రిత్వతండ్రి మనలను స్థిరపర్చి, వెయ్యేండ్లలో రాజుల వరుసలోనికి చేర్చి, పరిపాలించు ధన్యతను అనుగ్రహించునుగాక! ఆమేన్.

# ఎన్నిక జనము-2

క్రొత్త భూమ్యాకాశములు వచ్చినప్పుడు మనకు పాపమనగానేమియో చీకటి అనగానేమియో తెలియదు. వెయ్యేండ్లలోను మారిన భూమ్యాకాశములుండునుగాని గోగు, మాగోగు యుద్ధములో పాల్గొనే కఠిన హృదయము లుందురు. క్రొత్త భూమ్యాకాశములనగా పరలోకములో ఒక భాగము.

**ఎన్నిక జనము:-** వీరిని బానిసత్వములోనుండి రాజరికము వరకు తీసికొని వచ్చెను. రాజులైన తర్వాత మరియొక జాబితా వచ్చెను. అది ప్రవక్తలయొక్క సంఖ్య. ఇశ్రాయేలీయులలో లేచెను. ఎన్నిక జనములో బానిసలు లేచిరి. ఎన్నికజనము సంతోషపడి నిమిత్తమై వారిలోనుండి అందరిని మరియు ప్రవక్తలను కూడ లేపెను. వారిపని ఒకటి. పాతనిబంధన వారందరూ రక్షకుని కొరకు ఎదురుచూచిరి. వారన్ని తరగతులలోను వారికి మిక్కిలి కాంతిని కనబరచిరి. సంతోషితులైరి. అయితే ప్రవక్తలు రక్షకుని చరిత్ర పంచుకొనిరి. ఆయన ఏ ఊరులో పుట్టినారో ఎవరిలో పుట్టెనో ఆయనపని ఏలాగుండునో 1) వంశము 2) ఎవరియందు 3) ఏ ఊళ్ళో (ఊరిలో) 4) రాజ్యము 5) శ్రమ 6) ఆరోహణము ఇవన్నీ ఎలాగుండునో వారు పంచుకొనిరి. మోషే అబ్రాహాము కాలములో కొంచెము తెలుసునుగాని ప్రవక్తల కాలములో ఎంచుకొనెను. ఆఖరు ప్రవక్త మలాకీ వస్తాడని చెప్పి చనిపోయెను. అప్పుడందురు....కొరకు చూస్తారు. ఆయన వస్తే క్రీస్తుప్రభువు వస్తారు.

అబ్రాహాము మొదలు యూదలు బబులోను చెఱలోనికి వెళ్ళువరకు కటుంబ చరిత్ర. తర్వాత ఐగుప్తు తర్వాత కుటుంబములు కలిపి జనాంగములైరి. తర్వాత గోత్రముల

లెక్కవచ్చెను. అరణ్యములో గుడారమువేసి దానిచుట్టూ మాని గోత్రమిక్కడ అని నిర్మించెను. అది పాలెస్తీనా దేశములో స్థిరపరచెను. తర్వాత భటులు, యాజకులు, తర్వాత ప్రవక్తలైరి.

ఒకదానికంటె ఒకటి గొప్పదానిగా చేసెను. కటుంబము - జనాంగము - గోత్రములు - యాజకులు - రాజులు - ప్రవక్తలుగా వచ్చిరి. అప్పుడు వాగ్ధానము స్థిరపడెను. మొదట మోషే ఒక్కటే దేవునితో మాట్లాడేవాడు గాని చివరికి 16 గురు ప్రవక్తలు మాటలాడిరి. వారు రెండు సంగతులు 1) తప్పుచేస్తే శిక్ష 2) మీరు మారుమనస్సు పొందిన రక్షణ.

ఇది రెండు చెప్పుచూ రక్షకుని రాకడ గూర్చి చెప్పిరి. మోషే అబ్రాహాము దూరముగా చెప్పిరిగాని వీరు దగ్గరగా వచ్చిరి. 4) ఎన్నిక జనము మీరు, మీరు తప్పుచేస్తేనే శిక్షిస్తాను. మిమ్ములను అన్యులు హింసించితే నేను శిక్షిస్తాను అని చెప్పెను. పై 4 సంగతులు బోధిస్తూ వచ్చెను. ఇశ్రాయేలీయులను హింసించిన జనాంగములు ఐగుప్తీయులు వారువేరు. వారు దేవుని ప్రజలను హింసించిరి. గనుక దేశము ఉన్నది. ప్రజలు నశించిరి. దేవుని పట్టు నా ఎన్నిక జనము తప్పుచేస్తే నేను శిక్షిస్తాను గాని వారికేమి సంబంధము గనుక నేను వారిని నాశనము చేస్తానని నాశనము చేసెను.

ఎదోమీయులు వారిని వెళ్ళనీయగా నాశనమైరి. మోయాబీయులు - బిలామును శపించమనిరి గనుక నాశనమైరి. వారి నాశనమునకు కారణము దేవుని ప్రజలను నాశనముచేసిరి. దేశమునకు వచ్చిన తర్వాత కనానీయులు, ఫిలిష్తీయులు

వీరందరూ నాశనమైరి. దేవుని ప్రజలలో తప్పులున్నవి సరే వారు తీర్పరులు కారు. తర్వాత అష్షూరు వారి ఖైదులో వేసిరి. వారు నాశనమైరి. బబులోనువారు లేరు. ఏజనాంగము వారులేరు ఇప్పుడు అదే జరుగును.

ఇతరులెవరైన దేవుని బిడ్డల మీదికి వెళ్తారో వారికదే జరుగును క్రమముగా నాశనమగును. దేవునివల్ల ఏర్పర్చబడినవారు. ఎన్నికజనము మొదటివాడైన అబ్రాహాము అతనిని శపించిన వారిని శిక్షిస్తానన్నది. జనాంగముల వారిమీద నెరవేరును. దమస్కు వారుకూడా నాశనమైరి.

అయితే దేవుని జనము ఉంటారా? అన్యులు ఎవరిని ధిక్కరిస్తే నాశనమైరి. ఎన్నికజనము దేవుని ధిక్కరిస్తే వారు నాశనమైరి. క్రీస్తుప్రభువు సిలువవేసిరి. ఇశ్రాయేలీయుల వారు ఇప్పుడు శిక్షలో నున్నారు. రెండవ శతాబ్ధము నుండి శిక్షలో నున్నారు. పెంతెకొస్తు అయిన తర్వాత, 70సం॥లో వెళ్ళుట ప్రారంభించిరి. 15వ శతాబ్ధము తర్వాత కొన్నాళ్ళకు యెరూషలేములో ఎక్కడ యూదులు లేరు. దేవుని ధిక్కరించిరి గనుక మొదటి వెయ్యిసం॥లో పోయినవారు ఇంకాచేరుకోలేదు. 1900 ఏండ్లనుండి శిక్షలోనున్నారు. ఇంకా ఉన్నది. రాకడవరకు శిక్ష, 7 ఏండ్ల వరకు నుండును. అప్పుడు జనాంగ మంతరించి క్రైస్తవులైపోతారు.

పాఠములు:-

1. దైవభక్తులనెదిరిస్తే అంతరింపు
2. దేవుని ధిక్కరిస్తే నాశనము

ఎన్నిక జనము పొరపాట్లు:-

1. అన్యులతో సహవాసము చేసిరి. వారిని వెళ్ళగొట్టమంటే వియ్యమందిరి, కలసిపోయిరి.

2. ఐగుప్తీయులు దూడను మ్రొక్కుట చూచిరి. ఎఱ్ఱసముద్రము దాటేవరకు, సీనాయి పర్వతమువద్దకు వచ్చే వరకు మోషే ఎక్కేవరకు రాడనుకొనే వరకు చూచి దూడకు మ్రొక్కిరి. ఐగుప్తులో నేర్చుకొన్న పాఠము అంతది వచ్చెను. రాజుల కాలములో స్వతంత్రులైరి. గనుక ఇంక ఎక్కువ విగ్రహారాధన చేసిరి. తర్వాత రెండు ఖైదులలో నుండిరి. 1. అష్షూరు ఖైదు 2. బబులోను ఖైదు. ఇవి రెండు అయిన తర్వాత క్రీస్తుప్రభువు వచ్చిన తర్వాతను విగ్రహారాధన తలంపుపోయెను. మరల ఎజ్రా, నెహెమ్యాలు తీసికొని వెళ్లిన తర్వాత గుడిలోకి వచ్చి పూజచేసెను. విగ్రహారాధన పోగొట్టుకొనుటకు ఇన్ని కష్టములు సంవత్సరములు పట్టెను. సంతోషమే విగ్రహారాధనను మానివేసిరి.

**ఎన్నికజన మేళ్ళు:-**

1. కీడు తప్పించుట (1) బానిసత్వము (2) ఎఱ్ఱ సముద్రము పాయలగుట, మన్నా ఆహారము, 10 ఆజ్ఞలు క్షమించుట, రాజులు, యాజకులు, పర్ణశాల ఇవన్నీ ఉపకారములు.

(ఎ) కేవలము ఉపకారములు

(బి) కీడు తప్పించే ఉపకారములు

ఐగుప్తులో ఉన్నప్పుడు దేవుడు చేసిన మేలు. 1) పిల్లలను చంపినను గడ్డి ఇవ్వకపోయినను అణచివేయ చూచినను ఫరో

ఆపుచేయలేకపోయెను. 6 లక్షలైరి. వారు దేవుని ఆశీర్వాదము పొందిరి. వారికి సంతానము హెచ్చెను. హింసించిన తగ్గుటకు బదులు వృద్ధిపొందెను. యూదులు ఏమి పెంచిన మందలగును. తుదకు యూదులు కూడ మందలైరి. వారికి సంతానాభివృద్ధి ఆశీర్వాదము తప్పులున్న శిక్షించెను గాని తగ్గించలేదు. ఇప్పుడు తగ్గెను. యూదులు ఏ వర్తకము ప్రారంభించిన వృద్ధిపొందెను. ఈ ఆశీర్వాదము ఏ జనాంగమునకులేదు

2) మోషే ఉపాధ్యాయ యత్నము

3) ఇశ్రాయేలీయులు అరణ్యములో ఉన్నంతకాలము దేవునితో మాట్లాడెను. మోషేద్వారా మాట్లాడెను. ఇశ్రాయేలీయులు Pentateuch ( 5 కాండముల ధర్మశాస్త్రము) పెట్టుకొనిరి. మోషే నీవు మాట్లాడితే వింటాము గాని ఆ దేవుడు మాట్లాడితే చస్తాము అన్నారు. ఆ విధముగా నెరవేరెను.

ఈ కాలములో దేవుడు కనబడితే ఎవరికి అక్కరలేదు. దేవుడు నరావతారి వ్యక్తిగా క్రీస్తుప్రభువుగా బజారులతో, వేదాలలో కనబడెను. పండుగలకు అన్నిరకముల మనుష్యుల దగ్గరకు వెళ్ళి నేను కనబడుటకే వచ్చానని చెప్పుట ఈ కాలములో ప్రయత్నము చేసిన వారికి కన్పించును.

3) కావలసినవి కురిపించుట. బండ్లలో నుండి నీళ్ళు, ఆహారము, మన్నా మొదలగునవన్నీ మేళ్ళు. బండలో నీళ్ళు మన్నా. ఈ రెండు వారెన్నడు మరువడు. మాంసము, పూరేళ్ళు వచ్చి ముమ్మారు తినండి అన్నది. 40 సం॥లు బట్టలు మాయలేదు. కాళ్ళు వాయలేదు. దేవుడు ఎప్పుడు వారిమధ్య నున్నాడు. చిన్నిచిన్ని సంగతులు కూడ చెప్పెను. ముఖ్యమైనవి అముఖ్యమైనవి కూడ చెప్పెను.

రేపు సంఘమునకేమి ప్రభువు చేసెనో చెప్పవలెను. గొడుగు పట్టెను, లాంతరు పట్టెను. చీకటికి వెలగు– ఎండకు గొడుగు పట్టెను. 40 సం॥లు పట్టెను. దుఃకాణములన్నీ తెచ్చిపెట్టెను. దేవుడు తన జనమునకు అన్ని సదుపాయములు చేసెను. ఆ జనాంగమునకు చేసినట్లుగా అన్నిచేయుయును. ఎన్నిక జనమునకు ఎన్ని సదుపాయములు ఎన్నైన సదుపాయములు చేస్తాడు,చేశాడు. కుమ్మరించెను. కష్టములు తోడివేసెను. ఆకాశములో నుండి కుమ్మరింపు కాపరి కొదువలేదు. గిన్నె నిండి పొర్లును. అవన్ని తిన్నగానుంటేను. 1) అపకారములు తప్పించుట 2) ఉపకారముల కుమ్మరింపు.

ఈ కాలములో సంఘమనే ఎన్నిక జనమును పోషకుడవు. పాపక్షమాపణకర్తవు, వైద్యుడవు, నిన్ను స్వస్థపరచు యెహోవా, నడిపించే కర్తవు, సముద్రములో, అరణ్యములో, రాజువు, గ్రంథకర్తవు, ప్రవక్తలను రప్పించి చెప్పి వ్రాయించి పాత నిబంధనలో పెట్టించినావు. నేటివరకు వారు ఆ పుస్తకమును చంకపెట్టుకొని తిరుగుచున్నారు. బహు ఆశ్చర్యకరమైన దస్తావేడు. నిన్ను నమ్మే వారందరికి అన్ని చేస్తావు.

# జ్ఞాతవ్యము

## (ఐదవ భాగము)

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2012 వెల : రూ/- 15.00

Bible Mission HQ Guntur

గుంటూరు నందు:

ప్రథమ ముద్రణ 2012 ప్రతులు 5000

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

# బైబిలు మిషను ప్రచురణ

బైబిలు మిషను ప్రెస్ - పెదకాకాని, 522 509.

ఫోన్ : 2556149; 9949121777.

Bible Mission HQ Guntur